భార్యను కడతేర్చిన భర్త

దావణగెరె, న్యూస్‌టుడే : గృహలక్ష్మి పథకానికి సంబంధించి బ్యాంకు ఖాతాకు వచ్చిన నగదు తీసుకునేందుకు బ్యాంకుకు వచ్చిన సత్యమ్మ అనే గృహిణిని.. అక్కడి నుంచి పొలానికి తీసుకువెళ్లి ఆమె భర్త అణ్ణప్ప హత్య చేశాడని పోలీసులు తెలిపారు. జగళూరు తాలూకా ఒడెరహళ్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. సత్యమ్మ, అణ్ణప్ప ప్రేమించుకుని పుష్కరం కిందట వివాహం చేసుకున్నారు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. మద్యం కోసం డబ్బు ఇవ్వాలని భార్యను వేధిస్తూ వచ్చేవాడు. బ్యాంకులో జమ అయిన నగదు తీసుకునేందుకు వెళ్లిన సత్యమ్మను వెంబడిస్తూ అణ్ణప్ప వెళ్లాడు. నగదు డ్రా చేసుకున్న అనంతరం ఆమెను నమ్మించి పొలానికి తీసుకువెళ్లి హత్య చేసి, నగదుతో పరారయ్యాడు. బిళిజోడు పోలీసులు తెలిపారు.

కలుషిత నీటికి ఇద్దరు బలి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కలుషిత నీరు తాగి గుండమ్మ (60) అనే మహిళ, భువనేశ్వరి (10) అనే బాలిక మరణించారు. మరో పది మంది అస్వస్థతకు గురయ్యారు. చిక్కనాయనకహళ్లి తాలూకా సొరలమావుకు చెందిన బాధితులకు స్థానిక ఆసుపత్రిలో ప్రథమచికిత్స నిర్వహించి, మెరుగైన చికిత్స అందించేందుకు హాసన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గుండమ్మ, భువనేశ్వరి బుధవారం మరణించారు.

కోరిక తీర్చలేదనే.. హతం

కోలారు : కూలి కార్మికురాలు యశోదమ్మ (30)ను హత్య చేసి పరారైన ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం పట్టణానికి చెందిన సంతోశ్ కుమార్ (32) అనే వ్యక్తిని మాలూరు ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బెంగళూరులో పలు నేరాలకు పాల్పడి నాలుగుసార్లు కారాగారానికి వెళ్లిన నిందితుడు జామీనుపై బయట ఉంటున్నాడు. మాలూరు శివార్లలోని లేఅవుట్‌లో భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్న అతను తనతో కలిసి పని చేస్తున్న కార్మికురాలు యశోదపై కన్నేశాడు. అతని కోరిక తీర్చేందుకు నిరాకరించడంతో అక్టోబరు 15న ఆమెను హత్య చేశాడనే అభియోగంపై అరెస్టు చేశారు.

'శిగ్గావ్‌లో తిరుగులేని భాజపా'

హావేరి, న్యూస్‌టుడే : శిగ్గావ్ నియోజకవర్గం ఉపఎన్నికల్లో భాజపాలో ఎటువంటి తిరుగుబాటు లేదని మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బసవరాజ బొమ్మై తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు, ఎంపీ ఎన్నికల అనంతరమూ భరత్ బొమ్మై నియోజకవర్గం ప్రజలకు చేరువగానే ఉన్నారని తెలిపారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి బరిలో ఎవరు నిలిచినా, భాజపాకు పోటీ రాదన్నారు. యోగేశ్వర్ కాంగ్రెస్ నుంచి పోటీ చేసినా, కుమారస్వామి, దళపతుల ప్రభావం ముందు ఎన్నికల్లో ఆయన ఓటమి పాలవుతారని జోస్యం చెప్పారు. మూడు నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో మూడు స్థానాలను గెల్చుకోవడమే లక్ష్యంగా దళ్‌తో కలిసి పని చేస్తున్నామని చెప్పారు.

సిద్ధరామయ్యతో రేవంత్‌రెడ్డి భేటీ


ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క తదితరులు

ఈనాడు, బెంగళూరు : మైసూరు విమానాశ్రయంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాలోచనలు జరిపారు. వయనాడ్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రే బుధవారం నిర్వహించిన నామినేషన్ ప్రక్రియలో పాల్గొన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తిరుగు ప్రయాణంలో భాగంగా మైసూరు విమానాశ్రయంలో దిగారు. అదే సందర్భంగా వయనాడ్‌కు వెళ్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి చర్చించారు. ఈ సమాలోచనల్లో తెలంగాణ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో పాటు కర్ణాటక ఆహార, పౌరసరఫరాల మంత్రి కె.హెచ్.మునియప్ప, సిద్ధు కుమారుడు యతీంద్ర, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షి తదితరులు పాల్గొన్నారు.

చెన్నపట్టణలో రాజకీయ చదరంగం

యోగేశ్వర్ 'సర్జికల్ స్ట్రైక్'


సీపీ యోగేశ్వర్‌కు కాంగ్రెస్ పతాకాన్ని అందిస్తున్న డీకే శివకుమార్, ఇతర నాయకులు

ఈనాడు, బెంగళూరు : రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు పాత మైసూరులో పట్టుకోసం పాకులాడుతుంటాయి. అందులోనూ రాష్ట్ర రాజధానికి చేరువలోని రామనగర జిల్లాలో ఈ మూడు పార్టీలూ సమానమైన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుంటాయి. కాంగ్రెస్, జేడీఎస్ పోటాపోటీగా తలపడే ఈ ప్రాంతంలో అవకాశం దొరికితే భాజపా దూకుడుకు ప్రయత్నిస్తోంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో భాజపా అభ్యర్థి డాక్టర్ సి.ఎన్. మంజునాథ్ విజయం ఈ కోవలోనిదే. డీకే సోదరుల బలమైన రాజకీయాలను తట్టుకుని సౌమ్యుడైన మంజునాథ్ గెలిచారంటే ఆయనకు చెన్నపట్టణ భాజపా నేత సి.పి.యోగేశ్వర్ అందించిన సహకారం అంతా ఇంతా కాదు. పాత మైసూరులో భాజపా కేడర్‌కు కాపుకాసే ఈ మాజీ సైనికుడు నేడు మరో శిబిరానికి మకాం మార్చారు. తన రాజకీయ ప్రయాణానికి గట్టి పునాది వేసిన కాంగ్రెస్‌లోనికి మరోసారి చేరి అసలైన రాజకీయానికి తెరలేపారు. బుధవారం కేపీసీసీ కార్యాలయంలో ఆ పార్టీ సారథి డీకే శివకుమార్ నుంచి పార్టీ జెండాను అందుకుని పాత మిత్రులతో ఒక్కడయ్యారు.

మిత్రుడైన శత్రువు

మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో డీకే సురేశ్ ఓటమిలో యోగేశ్వర్ పాత్ర ఎక్కువే. చెన్నపట్టణలో ఒక్కలిగలు రాజకీయ ప్రాభవాన్ని ప్రదర్శిస్తుంటారు. విపక్ష నేత ఆర్.అశోక్, జేడీఎస్ నేత కుమారస్వామి, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్.. ఇలా మూడు పార్టీల అగ్రనేతలు ఈ సముదాయానికి చెందిన వారు. వీరందరికీ చెన్నపట్టణలో గెలుపు ప్రతిష్ఠగా మారింది. ఒక్కలిగ ఆధిపత్యానికి నాయకత్వం వహించే సి.పి.యోగేశ్వర్ నేడు కాంగ్రెస్ పంచన చేరటంతో ఎన్‌డీఏ మిత్రులకు మింగుడు పడని వ్యవహారంగా మారింది. మొన్నటి వరకు డీకే సోదరుల ఆధిపత్యాన్ని అడుగడుగునా అడ్డుకునే యోగి.. నేడు వారికి మిత్రుడుగా మారటం ఊహించని పరిణామం. తనకు భాజపా నుంచి టికెట్ దక్కదు, జేడీఎస్ గుర్తుతో గెలిస్తే భవిష్యత్తు కష్టమని అంచనా వేసి.. రెండు నెలలుగా కాంగ్రెస్ నేతలతో సంప్రదిస్తూ సరిగ్గా ఎన్నికల సమయానికి తన రూటే మిటో తేల్చారు. కేవలం రెండు రోజుల వ్యవధిలో విధానపరిషత్తు స్థానానికి, భాజపా సభ్యత్వానికి రాజీనామా, కాంగ్రెస్‌లో చేరిక ప్రక్రియను పూర్తి చేసిన సి.పి.యోగేశ్వర్‌కు చెన్నపట్టణ టికెట్ దక్కటం లాంఛనమే కానుంది.

కమలానికి.. దూరం

బెంగళూరు (శివాజీనగర): భాజపా నుంచి చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో టికెట్ దక్కదని ఖరారు కావడంతో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యోగేశ్వర్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. భాజపాలో తన ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. పార్టీ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఆయనకు పార్టీ పతాకాన్ని అందజేశారు. చెన్నపట్టణ ఉప ఎన్నికల కోసం ఆయన గురువారం నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తారు. భూవ్యాపారిగా, సినీ కథానాయకునిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా రాజకీయాల్లోకి వచ్చారు. భాజపా, సమాజవాది పార్టీ, కాంగ్రెస్ పార్టీల్లోనూ కొనసాగారు. భాజపా గత అధికార అవధిలో మంత్రిగానూ సేవ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి షరతులు లేకుండా ఆయన చేరారని డీకే శివకుమార్ పేర్కొన్నారు. తిరిగి సొంత ఇంటికి వచ్చినట్లు ఉందని యోగేశ్వర్ హర్షాన్ని వ్యక్తం చేశారు. తాను అభివృద్ధి చేసిన ప్రాంతం నుంచి పోటీ చేసేందుకు అవకాశం లేకపోవడంతో పార్టీ మారవలసి వచ్చిందన్నారు. పార్టీ వీడరాదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కోరినా ఆయన స్పందించలేదు. టికెట్ విషయంలో దళపతులు అంగీకరించకపోవడంతో ఆయన పార్టీ మారారు.


సిద్ధరామయ్యకు పాదాభివందనం చేసే ప్రయత్నంలో యోగేశ్వర్

దళంలో కలవరం

కేవలం ఓ విధానసభ క్షేత్రానికి పరిమితమైన ఓ నేత చేజారి పోయినంత మాత్రాన జాతీయ పార్టీ భాజపాకు వచ్చే నష్టమేమిటన్న ప్రశ్న తలెత్తక మానదు. ఈ ఒక్క క్షేత్ర రాజకీయం ఎన్‌డీఏ భాగస్వాముల మధ్య సఖ్యత లేదన్న సందేశాన్ని మరింత స్పష్ట పరిచింది. చెన్నపట్టణ విధానసభ క్షేత్రంలో నిర్ణయాధికారం జనతాదళ్ అధినేత, కేంద్ర మంత్రి కుమారస్వామికి హస్తిన నేతలు అప్పగించడమే భాజపా రాష్ట్ర నేతలు జీర్ణించుకోలేని అంశం. నేడు కేంద్ర మంత్రిగా ఉన్న కుమారస్వామి రాష్ట్ర నేతలతో కనీస సంప్రదింపులు లేకుండా అధిష్ఠానంతో తనకు అనుకూలమైన పనులు చేయించుకుంటున్నారన్న అభిప్రాయం భాజపా నేతల్లో గూడుకట్టుకుంది. చెన్నపట్టణ విషయంలోనే మూడు నెలలుగా సి.పి.యోగేశ్వర్‌కు టికెట్ ఇప్పించేందుకు విపక్ష నేత ఆర్.అశోక్ మొదలు సీనియర్లు అశ్వత్థనారాయణ, అరవింద్ బెల్లద్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తీవ్రంగా ప్రయత్నించారు. సి.పి.యోగేశ్వర్‌ను తీసుకుని పదేపదే దిల్లీకి వెళ్లి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్‌షాతోనూ చర్చించి వచ్చారు. చివరకు నిర్ణయాధికారం కుమారస్వామికి వదిలేయటంతో రాష్ట్ర నేతల్లో అసంతృప్తి చెలరేగింది. పైకి అధిష్ఠానంపై ఆక్రోశాన్ని వెళ్లగక్కకున్నా లోలోపల కలత చెందారు. పార్టీ గుర్తు ఉన్నా.., లేకున్నా చెన్నపట్టణలో గెలిచే అవకాశాలు సి.పి.యోగేశ్వర్‌కు మాత్రమే ఉన్నాయని భాజపా ఎమ్మెల్యే అశ్వత్థనారాయణ అనటం ప్రస్తావనార్హం. ఆయన చేజారి పోవటంతో ఈ క్షేత్రంలో వచ్చే ఫలితానికి కుమారస్వామి మాత్రమే బాధ్యత వహించాలని మరో భాజపా నేత ప్రీతమ్ గౌడ చేసిన వ్యాఖ్యలు భాజపాలోని అసహనానికి అద్దం పడుతున్నాయి.

అధిష్ఠానమే ఎంపిక..

యోగేశ్వర్ కాంగ్రెస్‌లో చేరినా చెన్నపట్టణలో కాంగ్రెస్ కార్యకర్తల భవిష్యత్తుకు, వారి ఆత్మ విశ్వాసానికి భంగం రాకుండా చూస్తాం. దశాబ్దాల తర్వాత కాంగ్రెస్‌లో చేరినా యోగేశ్వర్ రక్తంలో కాంగ్రెస్ విధానమే ఉంది. చెన్నపట్టణలో గట్టి నేత లేరన్న అభిప్రాయం సరికాదు. ఎవరున్నా, లేకున్నా కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. గురువారం మూడు పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేస్తారు. అభ్యర్థుల జాబితాలో యోగేశ్వర్ పేరు చేర్చి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపాం. అధిష్ఠానమే అభ్యర్థులను ఎంపిక చేస్తుంది.

-డీకే శివకుమార్, పీసీసీ అధ్యక్షుడు

ప్రమాదం లేదు

యోగేశ్వర్ కాంగ్రెస్‌లో చేరటంతో చెన్నపట్టణలో భాజపాకు ఎలాంటి ప్రమాదం లేదు. మా పార్టీలోని సీనియర్లు, కార్యకర్తలు, జేడీఎస్ పార్టీతో కలిసి ఎన్‌డీఏ అభ్యర్థి విజయానికి శ్రమిస్తారు. యోగేశ్వర్ పార్టీ మారుతాడని రెండు నెలల ముందే ఊహించాం. ఆయనకు పార్టీ మారటం ఓ సాధారణ ప్రక్రియ. పాత మైసూరులో పార్టీని మరింత బలోపేతం చేయటంపై మేము దృష్టి సారిస్తాం. గురువారం మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తాం. **-బి.వై.విజయేంద్ర, భాజపా అధ్యక్షుడు**

అవకాశవాద రాజకీయం

అధికారం ఎక్కడ దొరికితే అక్కడకు వెళ్లే యోగేశ్వర్ నేడు అదే పని చేశారు. పార్టీల విధానాలకు అనుగుణంగా ఆయన రాజకీయం చేయలేదు. ముందు నుంచీ ఆయనకు టికెట్ ఇవ్వాలనే జేడీఎస్ ప్రయత్నించింది. మా కుటుంబం నుంచి ఎన్‌డీఏ స్నేహానికి ఇబ్బంది కాకూడదని జాగ్రత్త పడ్డాం. సొంత పార్టీలో నేత దొరకకనే భాజపా నేతకు గాలం వేసిన కాంగ్రెస్ తన బలహీనతను చాటుకుంది. ఈ పరిణామం తర్వాత నేను మా నేత దేవేగౌడతో మాట్లాడాను. నేను పోటీ చేయాలని ఏనాడూ చెప్పలేదు. ఎన్‌డీఏ జాతీయ నేతల నిర్ణయం ప్రకారమే నడుచుకుంటా.

- నిఖిల్ కుమారస్వామి, దళ్

తొందరపడ్డారు

యోగేశ్వర్ కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశారు. తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని ముందు నుంచి హెచ్చరించినా వినలేదు. ఆ పార్టీలో సీనియర్ నేతలు ఎందరో ఉండగా.. యోగేశ్వర్‌కు అవకాశాలు దక్కటం కష్టమే. పైగా చివరి రోజు వరకు చెన్నపట్టణ అభ్యర్థిని ప్రకటించలేదంటే అందుకు కారణమే యోగేశ్వర్. ఆయనకు అవకాశం ఇవ్వాలని రెండు పార్టీలు యత్నించాయి. జాతీయ నేతలు యోగేశ్వర్‌కు టికెట్ ఇవ్వాలనే చూశారు. తొందరపాటుతో భవిష్యత్తును నాశనం చేసుకున్నారు.

-ఆర్.అశోక్, విపక్ష నేత

శిథిలాల కింద మరణమృదంగం

భవంతి కూలిన ఘటనలో ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య


శిథిలాల వద్ద చేపట్టిన సహాయక చర్యలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : కన్నడిగుల రాజధాని నగరి బెంగళూరులోని బాబూసాబ్‌పాళ్యలో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవంతి మంగళవారం సాయంత్రం కూలిపోయిన ఘటనలో.. శిథిలాల కింద చిక్కుకుని మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. మంగళవారం రాత్రి అర్మాన్ (26) అనే బిహరుకు చెందిన కార్మికుడి మృతదేహాన్ని వెలికి తీశారు. బుధవారం మధ్యాహ్నం వరకు మహ్మద్ సాహిల్ (19), త్రిపాల్ (35), శంకర్ (26), సత్యరాజ్ (25)ను వెలికి తీయగా.. మరో ముగ్గురి వివరాలను గుర్తించవలసి ఉందని హెణ్ణూరు ఠాణా పోలీసులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకుని గాయపడిన జగదేవి (45), రషీద్ (28), నాగరాజ్ (25), రమేశ్ కుమార్ (28)లను చికిత్స కోసం బెంగళూరు సౌత్ ఆసుపత్రిలో చేర్పించారు. హర్మాన్, అయాజ్ అనే కార్మికులను వరుసగా హోస్మట్, ఆస్టర్ ఆసుపత్రుల్లో చేర్చారు. విపత్తు నిర్వహణ దళం, అగ్నిమాపక దళ సిబ్బంది సెన్సార్, శ్వానదళం (డాగ్‌స్క్వాడ్) సహకారంతో గాలింపు చేపట్టారు. మరో ఏడుగురు కార్మికులను మంగళవారం సాయంత్రమే సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.


ఓ కార్మికుని మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ దళం

ఇద్దరి అరెస్టు..

భవంతి కూలిన ఘటనలో దాని యజమాని, మల్లేశ్వరంలో ఉంటున్న ప్రవాసాంధ్రుడు భువన్ రెడ్డి, గుత్తేదారు మునియప్పను హెణ్ణూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఘటన జరిగిన వెంటనే ఇద్దరూ పరారయ్యారు. పరారీలో ఉన్న భవనం యజమాని కుమారుడు మోహన్‌రెడ్డి, మేస్త్రీ కోసం పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. ఎనిమిది నెలల నుంచి ఈ భవంతి నిర్మాణం కొనసాగుతోంది. సెల్లార్‌తో పాటు నాలుగు అంతస్తులను నిర్మించేందుకు అనుమతి తీసుకుని ఆరు అంతస్తులను నిర్మిస్తున్నారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. నాశిరకం- సిమెంటు, ఇతర భవన నిర్మాణ సామగ్రిని వినియోగించడంతోనే పునాదుల నుంచే భవంతి విరిగి పక్కకు పడింది. పునాది కోసం తీసిన గుంతల్లో మట్టి వదులుగా మారడంతోనూ అది ఒకేసారి పక్కకు ఒరిగి పడిపోయిందని గుర్తించారు. ప్రమాదం సంభవించిన సమయంలో 21 మంది కార్మికులు అక్కడ పని చేస్తున్నారు. మరో కార్మికుడు శిథిలాల కింద ఉండి ఉంటాడని అనుమానిస్తున్నామని అగ్నిమాపకదళ అధికారులు వివరించారు.



ధ్వంసరచన

గాలి, వానకు ఉద్యాననగరి వృక్షరాజాలు విలవిలలాడుతున్నాయి. వీవీపురం పరిధి నెటెకలప్ప కూడలిలో బుధవారం ఉదయం ఒక భారీ వృక్షం నేలకొరిగింది. చెట్టు కొమ్మలు పడి దాని కింద నిలిపిన కార్లు ఎలా ధ్వంసమయ్యాయో ఇక్కడ చూడొచ్చు. చెట్టు పాదు వద్ద పాదచారి మార్గం ఉండడం, వేళ్లలోకి నీరు చేరుకుని, అది విరిగి పడిందని గుర్తించారు.

– న్యూస్‌టుడే, మల్లేశ్వరం

రాజధాని బతుకులు నీటిపాలు


ఎడతెగని వానతో కడగండ్లు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : ఉద్యాననగరిలో బుధవారం ఉదయం నుంచి ఎండగా ఉన్న వాతావరణం సాయంత్రానికి మారిపోయిది. పలు ప్రాంతాల్లో కుండపోత వర్షంతో రహదారులు జలమయంగా మారాయి. విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లవలసిన ఉద్యోగులు, కళాశాలల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయిలేఅవుట్, టాటానగర, సిల్కుబోర్డు చుట్టుపక్కల ప్రాంతాల్లో రహదారులు వాగుల్లా మారాయి. యలహంక, కేంద్రీయ విహార్, సాయి లేఅవుట్, టాటానగర తదితర ప్రాంతాల్లో విపత్తును ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పరిశీలించారు. గత 120 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు కురవడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. విపత్తు నిర్వహణతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రాజకాలువపై కబ్జాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రీయ విహార్‌ను ఖాళీ చేసి వెళ్లాలని సూచించినా.. ఐదు శాతం మంది ఇప్పటికీ పైఅంతస్తులో ఉన్నారని గుర్తించారు. వారికి కావలసిన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని శివకుమార్ తెలిపారు. కెంగేరి చెరువులో మునిగి మరణించిన అన్నా చెల్లెళ్లు జాన్‌సేన, మహాలక్ష్మి కుటుంబానికి రూ.5 లక్షలను ఆయన ప్రకటించారు. పాలికె తరఫున రూ.10 లక్షలు అందిస్తామని ప్రధాన కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో జయనగర, బీటీఎం లేఅవుట్, సిల్కుబోర్డు, బన్నేరుఘట్ట రోడ్డు, కోరమంగల, మడివాళ తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి మళ్లీ నీరు వచ్చింది. కొన్ని చోట్ల చెట్లు, కొమ్మలు విరిగిపడడంతో వాహన సంచారానికి ఆటంకం కలిగింది. నిర్మాణంలో ఉన్న మెట్రో మార్గం వద్ద మూడు అడుగుల నీరు నిలిచింది. వర్షంతో ఇళ్లలోకి ఎలుకలు, పాములు వస్తున్నాయని పలు ప్రాంతాల్లో ప్రజలు ఫిర్యాదు చేశారు. హొరమావు ప్రాంతంలో ఇళ్లలోకి నీరు చేరుకుని నష్టాన్ని ఎదుర్కొన్న నివాసులకు తలా రూ.పది వేల పరిహారం ఇస్తామని శివకుమార్ ప్రకటించారు.


భారీ వర్షంతో కాలువలా మారిన మాన్యత టెక్‌పార్కు సమీపంలోని రహదారి


కొనసాగుతున్న వర్షాలు

బెంగళూరు, బెంగళూరు గ్రామీణం, చిక్కబళ్లాపుర, హాసన, కొడగు, కోలారు, మండ్య, రామనగర, శివమొగ్గ, తుమకూరు తదితర జిల్లాల్లో గురువారం సాయంత్రం వరకు ఎల్లో అలర్ట్ ఉంటుందని భారతీయ వాతావరణ శాఖ ప్రకటించింది. బెంగళూరులో వర్షం కురుస్తున్న సమయంలో చెట్లు, పెద్ద స్తంభాల వద్ద నిలబడవద్దని, వాహనాలను నిలపవద్దని ట్రాఫిక్ పోలీసులు కోరారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు బెంగళూరులో 23.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. హుబ్బళ్లి వద్ద కాలువపైకి వరద నీరు రావడంతో నాగరాజ దేవణ్ణవర అనే వ్యక్తి కారుతో సహా కొట్టుకుకోయారు. స్థానికులు స్పందించి అతన్ని రక్షించారు. భారీ వర్షం కురుస్తున్న సమయంలో కాలువలు, నదుల వద్దకు వెళ్లవద్దని ఆయా జిల్లా పాలనా యంత్రాంగాలు స్థానికులను హెచ్చరించాయి.


శివకుమార్‌కు పరిస్థితిని వివరిస్తున్న పాలికె కమిషనర్ తుషార్ గిరినాథ్

నేటి నుంచే హాసనాంబ దర్శనభాగ్యం

హాసన, న్యూస్‌టుడే : చరిత్ర ప్రసిద్ధి హాసనాంబ తలుపులు గురువారం తెరుచుకోనున్నాయి. నవంబరు మూడో తేదీ వరకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించనున్నారు. గత ఏడాది 14 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఏడాది కనీసం 25 లక్షల మంది భక్తులు కదలివస్తారని జిల్లా పాలనా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులు వరుసలో వెళ్లేందుకు బ్యారికేడ్లు, ఎండ, వాన నుంచి రక్షణకు జర్మన్ టెంట్లు, దోనెల్లో ప్రసాదం వితరణ, మైసూరు దసరా వేడుకల తరహాలో విద్యుత్తు దీపాలంకరణ, హాసన వీక్షణకు డబుల్ డెక్కర్ బస్సు సదుపాయాలు, హాట్ ఎయిర్ బెలూన్‌లో ప్రయాణించే సదుపాయం, ప్యారా గ్లైడింగ్, రాష్ట్ర స్థాయి నృత్య పోటీలు.. ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. హాసనాంబ యాప్ ద్వారా రూ.300, రూ.1000 టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించామని జిల్లాధికారి సి.సత్యభామ తెలిపారు. ఆలయం 11 రోజులు తెరచి ఉంచుతున్నా భక్తులను 9 రోజులు మాత్రమే రోజులో 24 గంటలూ దర్శనం చేసుకునేందుకు అవకాశం కల్పించామని వివరించారు. రోజులో అమ్మవారిని నాలుగుసార్లు వేర్వేరుగా అలంకరిస్తామని అర్చకులు తెలిపారు.


ఫిర్యాదు ప్రతిని చూపిస్తున్న ఎన్ఆర్ రమేశ్

కొండలా.. చెత్త అక్రమాలు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : బెంగళూరు మహానగర పాలికెలో చెత్త నిర్వహణ పేరిట అధికారులు, నాయకులు రూ.2067 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని భాజపా నాయకుడు ఎన్ఆర్ రమేశ్ ఆరోపించారు. అక్రమాలకు సంబంధించి 1,295 పుటల దాఖలాలను ఈడీ అధికారులకు ఆయన బుధవారం అందజేశారు. చెత్త నిర్వహణ, సంస్కరణలకు విడుదల అవుతున్న నిధుల్లో ప్రతిసారీ 90 శాతం పక్కదారి పడుతున్నట్లు ఆరోపించారు. పాలికె ముఖ్య కమినర్ తుషార్ గిరినాథ్, మాజీ కమిషనర్లు లక్ష్మీనారాయణ, జి.కుమార్ నాయక్, మంజునాథ్ ప్రసాద్, బీహెచ్ అనిల్ కుమార్, గౌరవ్ గుప్తలను విచారించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులను కోరానని చెప్పారు. నిధులు పక్కదారి మళ్లడంతోనే నగరంలో చెత్త నిర్వహణ పూర్తి స్థాయిలో చేపట్టలేక పోతున్నారని వివరించారు.

శాంతించని తుంగభద్ర



తుంగభద్ర 21 గేట్లగుండా దిగువకు వెళ్తున్న తుంగభద్ర జలాలు




తుంగభద్ర ఆనకట్ట ఎదురుగా ఉన్న ఓ వంతెనను తాకుతూ పరుగులిడుతున్న నదీ జలాలు

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్రకు వస్తున్న వరద ప్రమాణం కొంత తగ్గినా సరాసరి లక్ష క్యూసెక్కులకు చేరుకుంది. ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ, ఆగుంబె, తీర్థహళ్లి ప్రాంతాల్లో వర్షాలు తగ్గాయి. అయినప్పటికీ వస్తున్న వరద తగ్గముఖం పట్టలేదు. బుధవారం సాయంత్రం జలాశయానికి 105000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 33 గేట్లలో 21 గేట్లను పైకెత్తి అంతే ప్రమాణంలో నీటిని నదికి విడుదల చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో వరద ప్రమాణం తగ్గే అవకాశం ఉందని ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 1631.92 అడుగుల నీటినిల్వ ఉంది. పెద్ద ఎత్తున నీటిని బయటకు విడుదల చేయడంతో జలాలు ఆనకట్ట ఎదురుగా మునిరాబాద్ మార్గంలో ఉన్న ఓ వంతెనను తాకుతూ పారుతున్నాయి.



సంధ్యాసమయంలో తుంగభద్ర అందాలు



కంప్లి కోటె వంతెనపై నడుచుకుంటూ వెళ్తున్న ప్రజలు

పాదచారులకు అనుమతి

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి కోటె వంతెన వద్ద తుంగభద్రమ్మ నిండుగా ప్రవహిస్తోంది. వంతెనకు ఆనుకుని నదీ ప్రవాహం ఉండడంతో వాహన రాకపోకలను నియంత్రించారు. పాదచారులను అనుమతించడంతో వంతెనకు ఇరువైపులా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కంప్లి నుంచి ప్రజలు వాహనాల్లో వంతెన వద్దకు వెళ్లి నడుచుకుంటూ వంతెన దాటి వాహనాల్లో గంగావతి వైపు వెళ్తున్నారు.

కబడ్డీలో బళ్లారి ఎస్.ఎస్.ఎ కళాశాల జట్టు సత్తా



విజేతగా నిలిచిన బళ్లారి ఎస్.ఎస్.ఎ కళాశాల జట్టు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలు బుధవారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో బళ్లారి ఎస్.ఎస్.ఎ జట్టు సత్తా చాటి విజేతగా నిలిచింది. ఈ కబడ్డీ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 16 విశ్వవిద్యాలయాల నుంచి జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో బళ్లారి ప్రభుత్వ ఎస్.ఎస్.ఎ-బళ్లారి ఎస్.జి.ఆర్.సి.ఎం.సి జట్లు పోటీ పడ్డాయి. (20-14) పాయింట్లతో బళ్లారి ఎస్.ఎస్.ఎ జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో బళ్లారి ఎస్.జి.ఆర్.సి.ఎం.సి జట్టు, కురుగోడు, అరసికెరె జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. బెస్ట్ రైడర్స్‌గా శంకర్, ఉత్తమ డిఫెండర్‌గా ఉమాపతి, ఆల్ రౌండర్‌గా సందీప్ నిలిచారు. గెలుపొందిన జట్లకు పూర్వ ఉపకులపతి తిప్పేరుద్రప్ప, విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు చంద్రశేఖర్ గౌడ, వీఎస్కేయూ క్రీడాధికారి శశిధర కల్లూరు, అధికారులు సంపత్‌కుమార్, పంపనగౌడ, ముత్తేగౌడ, కవి, సంగనగౌడ, వెంకటేశ్, మల్లికార్జున, పాపయ్య, రాథోడ్ పాల్గొన్నారు.

సండూరులో భాజపా జెండా ఎగురవేస్తాం

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో భాజపా జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే, బళ్లారి అధ్యక్షుడు కె.ఎస్.నవీన్ పేర్కొన్నారు. బుధవారం భాజపా కేంద్రీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో భాజపా టికెట్ కోసం కె.ఎస్.దివాకర్, బంగారు హనుమంత, మాజీ ఎంపీ వై.దేవేంద్రప్ప ప్రయత్నాలు చేశారు. బంగారు హనుమంతను పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. కె.ఎస్.దివాకర్ 20 ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి శ్రమించారు. గత విధానసభ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నాలు చేసినా.. టికెట్ రాలేదు. కె.ఆర్.పి.పి. తరఫున పోటీ చేసి 32వేల ఓట్లు సాధించారు. కె.ఎస్.దివాకర్‌కు సండూరు నియోజకవర్గంలో మంచి పట్టు ఉంది. దివాకర్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవాలని తెరవెనుక ప్రయత్నాలు జరిగాయి. భాజపాకు నిజమైన కార్యకర్త కావడంతో ఎలాంటి ఆఫర్లు చేసినా.. తిరస్కరించి పార్టీ అభ్యర్థి గెలుపునకు శ్రమించడానికి చేతులు కలిపారు. కె.ఎస్.దివాకర్ పార్టీకి చేస్తున్న శ్రమను గుర్తించి రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర నేడు రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశ పత్రాలను జారీ చేశారన్నారు. అభ్యర్థి ముఖ్యం కాదు. పార్టీ గుర్తు ముఖ్యం. మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్ప, ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ముఖ్యమని పార్టీ ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కె.ఎస్.దివాకర్‌ను 25 ఏళ్లుగా చూస్తున్నాను, వారు కుటుంబమే పార్టీ కోసం శ్రమిస్తున్నారు. టికెట్ రాలేదని నిరుత్సాహం చెందినా చక్కటి భవిష్యత్తు ఉంటుందన్నారు. కె.ఎస్.దివాకర్ మాట్లాడుతూ పార్టీకి ఎలాంటి డిమాండ్లు పెట్టలేదు. పార్టీ గుర్తు ముఖ్యమన్నారు. మంగళవారం రాత్రి బళ్లారి నగరంలో జరిగిన సమావేశానికి సండూరు విధానసభ క్షేత్రం నుంచి వేయిమందికిపైగా కార్యకర్తలు వచ్చారు. ఈ సారి భాజపాను గెలిపించాలని కంకణం కట్టుకున్నాం. భాజపా నేతల మధ్య బేధాభిప్రాయంతో ఇ.తుకారామ్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన సొంత శక్తితో గెలుపొందలేదు. ఈ సారి అందరూ ఐకమత్యంతో పార్టీ అభ్యర్థి గెలుపునకు శ్రమిస్తున్నారు. ఇ.తుకారామ్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినా నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. సరైన తాగునీటి ఇవ్వలేదని, బస్సు ప్రాంగణం లేదు, ఆసుపత్రిలో మౌలిక సౌకర్యాలు కల్పించలేదని దుయ్యబట్టారు. ఓటర్లు భాజపా అభ్యర్థిని గెలిపించాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అనంతరం కె.ఎస్.దివాకర్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేసిన ఆదేశ పత్రాలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, హనుమంతప్ప, విరూపాక్ష గౌడ, తిమ్మారెడ్డి, వెంకటేశులు, డా.అరుణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె.ఎస్.నవీన్, చిత్రంలో ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, కె.ఎస్.దివాకర్ తదితరులు



చిక్కమ్యాగేరిలో మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్

ఆరోగ్య సేవలకు రూ.856 కోట్లు

గంగావతి,న్యూస్‌టుడే: కల్యాణ కర్ణాటక దినోత్సవం నాడు కలబురగిలో జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఆరోగ్య శాఖకు రూ.856 కోట్లు కేటాయించినట్లు సంబంధిత శాఖ మంత్రి దినేష్ గుండూరావ్ తెలిపారు. ఆయన బుధవారం కొప్పళ జిల్లా చిక్కమ్యాగేరిలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రానున్న రెండేళ్లలో రెండు జిల్లా ఆస్పత్రులు, 8 ఉప విభాగ ఆస్పత్రులు, 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 పట్టణ ఆరోగ్య కేంద్రాలను కల్యాణ కర్ణాటక ప్రాంతంలో నిర్మించనున్నట్లు చెప్పారు. యలబుర్గా నియోజకవర్గానికి 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కేటాయించామన్నారు. కుకనూరులో 100 మంచాల ఆసుపత్రిని నిర్మించనున్నట్లు చెప్పారు. దీని కోసం రూ.40 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కనకగిరి, కారటగి ఆసుపత్రులను సైతం అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి, కాడా అధ్యక్షుడు హసన్‌సాబ్ పాల్గొన్నారు.

తుంబిగెరెలో నియంత్రణలోకి అతిసారం

హొసపేటె, న్యూస్‌టుడే: హరపనహళ్లి తాలూకా టి.తుంబిగెరెలో వాంతులు, విరేచనాల కేసులు అదుపులో ఉన్నాయని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. మూడు రోజుల నుంచి గ్రామంలోనే మకాం వేశాం. వైద్య శిబిరం ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాం. 19 తరువాత ఒక్క కేసూ నమోదుకాలేదు. గ్రామంలో వాంతులు, విరేచనాలతో ఐదుగురు చనిపోయారన్న వదంతులతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారని వివరణ వ్యక్తం చేశారు. 14న వాంతులు, విరేచనాలతో ప్రైవేటు ఆసుపత్రి చేరిన మహంతేశ్ కోలుకున్నాడు. రెండు రోజుల తరువాత మరోసారి అస్వస్థత గురై చనిపోయారు. అతని వైద్య నివేదికలు పరిశీలించగా, మూత్రపిండ సమస్యలు ఉన్నట్లు తేలింది. 17న వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న సురేశ్ అనే వ్యక్తి చనిపోయారు. అతనికి వేరే ఆరోగ్య సమస్యలు ఉన్నాయని స్పష్టం చేశారు. మరో ముగ్గురు చనిపోయారన్న వదంతుల్లో వాస్తవంలేదని స్పష్టం చేశారు. ఇలాంటి వాటిని నమ్మవద్దని ఆయన కోరారు. గౌరమ్మ(80) అనే వృద్ధురాలు వాంతులు, విరేచనాలతో మృతిచెందిందని గ్రామస్థులు వాపోతున్నారు.

అంబాదేవి ఆలయ సమితి సభ్యుడి ఎన్నిక



కరుటూరి శేషగిరిరావు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా ప్రసిద్ధ పురాతన దేవస్థానం అంబామఠంలోని శ్రీక్షేత్ర సిద్ధపర్వత అంబాదేవి ఆలయానికి నూతన పాలక మండలి ఏర్పాటైంది. దేవదాయ శాఖ పరిధిలోని ఈ నూతన పాలక మండలిని రాష్ట్ర ధార్మిక పరిషత్ బుధవారం ప్రకటించింది. ఇందులో లక్ష్మీక్యాంపు వాసి, తెలుగు ప్రముఖుడు కరుటూరి శేషగిరిరావుకు స్థానం దక్కింది. పరిషత్ ప్రకటించిన ఎనిమిది మంది జాబితాలో కరుటూరి శేషగిరిరావు, బంగారిక్యాంపు సదానంద శర్మ, గొరేబాళ్ ఎం.రంగనగౌడ, సోమలాపూరు గ్రామపు శేఖరమ్మ, పార్వతి, శివప్ప గొబ్బరకల్లు, శివశంకరగౌడ సింగాపూరు, రాఘవేంద్ర రెడ్డి ముక్కుంద తదితర ప్రముఖులు ఉన్నారు. నూతన సమితిలో సభ్యునిగా నియమితులైన శేషగిరిరావుకు వివిధ క్యాంపుల ప్రజలు అభినందనలు తెలిపారు.

వరదలో చిక్కుకొన్న గొర్రెల కాపరులు

రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



సిబ్బంది గొర్రెల కాపరులను తాడు సాయంతో రక్షించిన అగ్నిమాపక దళం

చెళ్లకెర(చిత్రదుర్గం): చెళ్లకెర తాలూకా గజ్జుగాన హళ్లి చెరువు మధ్యలోని గుట్టను వరదనీరు చుట్టుముట్టడంతో బయటకు రాలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న మంజునాథ్, మారణ్ణ, నర్తన్ కుమార్ అనే గొర్రెల కాపరులను అగ్నిమాపక దళం సిబ్బంది తాడు సాయంతో రక్షించారు. ఈ సంఘటన మంగళవారం జరిగిందని అధికారులు తెలిపారు. గొర్రెల మేత కోసం కాపరులు ఉదయం గుట్టలోకి వెళ్లారు. ఒక్కసారిగా చెరువులో వరదనీరు పెరిగి గుట్టను చుట్టముట్టింది. దీంతో బయటకు రాలేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గుర్తించిన గ్రామ ప్రజలు, పోలీసులు, అగ్నిమాపక దళం సిబ్బంది తాడు సాయంతో ముగ్గురినీ రక్షించారు.

వాగులో ట్రాక్టర్ బోల్తా

గజ్జుగాన హళ్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ రాళ్లను నింపుకొని నాయకనహట్టి వైపు వస్తుండగా దారికి అడ్డంగా ఉన్నా వాగును దాటడానికి ప్రయత్నిస్తుండగా అదుపు తప్పి ప్రవాహంలో కొట్టుకుపోయింది. వాహన చోదకుడు ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. మనమైనహట్టి గ్రామం వద్ద వాగును దాటడానికి ప్రయత్నించి ఓ ఆటో ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు అతి కష్టంపై ప్రమాదం నుంచి బయట పడ్డారు.



నగరసభకు నూతనంగా ఎన్నికైన సభ్యులు

నగరసభకు అయిదుగురు నామినేటెడ్ సభ్యులు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు నగరసభకు కొత్తగా అయిదు మంది కాంగ్రెస్ కార్యకర్తలు నామినేట్ సభ్యులుగా నియమితులయ్యారు. బుధవారం రాష్ట్ర నాగరికాభివృద్ధి శాఖ నూతన నామినేట్ సభ్యుల జాబితాను ప్రకటించింది. గరీబ్ పాషా, కె.నాగరాజ్, అయూబ్ ఖాన్, సంగీత, మల్లికార్జున్ మాలీపాటిల్ ఈ అయిదుగురూ సింధనూరు నగరసభకు నామినేటెడ్ కౌన్సిలర్లుగా నియమితులయ్యారు. గడిచిన పది రోజులుగా పట్టణంలో దీనిపై తీవ్ర రాజకీయ చర్చ జరిగింది. ఎమ్మెల్సీ బసనగౌడ, ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ ఇద్దరూ నగరసభ నామినేట్ పదవులపై తమ స్థాయిలో ప్రయత్నాలు జరిపారు. చివరకు ఎమ్మెల్యే బాదర్లి ఇందులో పై చేయి సాధించారు. ఆయన అనుచరులకే అయిదు పదవులూ దక్కేలా చక్రం తిప్పి విజయం సాధించారు.

బెయిల్ పిటీషన్ల విచారణ వాయిదా

బెంగళూరు (శివాజీనగర) : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి (33) హత్య కేసులో తమకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ నిందితులు పవన్, నందీశ్, రాఘవేంద్ర వేసుకున్న అర్జీ విచారణలు వాయిదా పడ్డాయి. రాఘవేంద్ర అర్జీని అక్టోబరు 25కు, మిగిలిన ఇద్దరి విచారణను 28కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఆదేశించారు.

తటాకాల తుళ్లింత.. భూమాత పులకింత!



మొన్నటిదాకా ఎండి.. నేడు నిండిన నాగవార చెరువు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు నిండు కుండల్లా మారిపోతున్నాయి. మొన్నటి ఎండాకాలంలో తడారి.. ఎండిపోయి కనిపించినవన్నీ నేడు కొత్తనీటితో కళకళలాడుతున్నాయి. చెరువుల్లోకి వాన నీరు పొంగి ప్రవహించి వచ్చాక పరిసరాలకే కొత్త అందాలు వచ్చాయి. చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం అమాంతం పెరిగిందని పర్యావరణ శాఖ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు భూగర్భ జలాల మట్టం క్షీణించి.. పనికిరాకుండా పోయిన 1738 బోరు బావులు నేడు చైతన్యవంతమైనట్లు బెంగళూరు జలమండలి అధికారులు ప్రకటించారు. శివార్లలో తాగునీటి ఎద్దడిని ఈ వర్షం తీర్చినట్లేనని సంతోషం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు కొనసాగిన ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పనులను నిలిపివేశామని వివరించారు. అపార్ట్‌మెంట్లకు అనుబంధంగా ఉన్న బోరుబావుల్లో నీరు వృద్ధి చెంది, ఇక్కట్లు తీరాయి. అనేక ప్రాంతాల్లో ఈసారి వాన నీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో భూగర్భజలాల మట్టం పెరిగిందని గుర్తించారు. రెండువారాల నుంచి ఎడతెరిపిలేకుండా నిత్యం చినుకులు రాలుతున్నాయి. చుట్టుపక్కల ప్రదేశాలు పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. నగర మధ్య భాగంలో 13 చెరువులు ఉండగా శివార్లలో 32 విస్తరించాయి. వాటిల్లో 12 పూర్తి స్థాయిలో నిండగా పదింట సగం, మిగతా వాటిలో ఓమోస్తరు వాననీరు నిలిచింది. ప్రజలు, పశువులకు తాగునీటి కొరత లేకుండా పోయిందని పాలికె చెరువుల నిర్వహణ అధికారులు తెలిపారు. కెంపాబుద్ధి, పుట్టనహళ్లి, సారక్కి, మహదేవపుర తదితర చెరువుల్లో పూడిక తొలగించడంతో నిల్వ స్థాయి పెరిగింది. హెబ్బాళ్, యలహంక, నాగవార, హలసూరు, బెట్టహళ్లి, జక్కూరు, కృష్ణరాజపురం, వైట్‌ఫీల్డ్, దాసరహళ్లి, అబ్బిగెరె, సోలదేవనహళ్లి, అగర, మడివాళ, యడియూరు తదితర తటాకాల్లో వాననీరు తొణికిసలాడుతోంది. వాటి సమీపానికి వివిధ ప్రాంతాలనుంచి పక్షుల రాక మొదలైనట్లు అధికారులు తెలిపారు.



బెట్టహళ్లి చెరువు అభివృద్ధి చేశాక నిండిందిలా



జక్కూరు చెరువు.. నగర వాకిట జలదరువు

వీరవనితకు జననీరాజనం

ఘనంగా కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతి



బళ్లారి : కిత్తూరు రాణి చెనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేయర్ ముల్లంగి నందీష్, తదితరులు

బళ్లారి,న్యూస్‌టుడే: బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత, స్వాతంత్ర్య సమరయోధురాలు కిత్తూరు రాణి చెన్నమ్మ ఎందరో మహిళలకు స్ఫూర్తిదాయకమని మేయర్ ముల్లంగి నందీష్ పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, కన్నడ సంస్కృతి శాఖ, నగర పాలికె సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం డా.జోళదరాశి దొడ్డనగౌడ మందిరంలో ఏర్పాటు చేసిన కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతిని ప్రారంభించి మాట్లాడారు. మహా నాయకురాలు కిత్తూరు రాణి చెన్నమ్మ..ఏడేళ్ల వయస్సులోనే గుర్రపు స్వారీ, విలువిద్య, ఖడ్గ విద్యలో నిష్ణాతురాలు అన్నారు. చెన్నమ్మ ధైర్య సాహసాలు ప్రపంచానికి ఉదాహరణ అని గుర్తుచేశారు. జిల్లా శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయులు సిద్ధలింగప్ప ప్రత్యేక ఉపన్యాసం చేస్తూ, భారతదేశంలోనే కిత్తూరు సంస్థానమే ప్రథమంగా స్వాతంత్ర్య పోరాటంలో భాగమైందన్నారు. వీర సైనికుల రక్తంతో ఇక్కడి నేల పునీతమైందన్నారు. కంప్లికి చెందిన శైల నేతృత్వంలో దేశభక్తి గేయాలను పాడారు. సంస్కృతిశాఖాధికారి నాగరాజ, వీరశైవ లింగాయత పంచమసాలి అధ్యక్షుడు నీలగౌడ, కన్నడ సంస్కృతిశాఖ విశ్రాంత ఉపనిర్దేశకుడు చోరనూరు కొట్రప్ప, ప్రముఖులు రాజేశ్వరి, నాగవేణి, సింధూరు, సురేఖ మల్లనగౌడ, ఈరమ్మ సురేంద్ర పాల్గొన్నారు.

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతి జరిగింది. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. పంచమసాలి సముదాయ తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర గౌడ, తహసీల్దార్ శివరాజ్ తదితరులు రాణి చెన్నమ్మ ధైర్య సాహసాలు, జీవిత విశేషాల గురించి మాట్లాడారు. వీరశైవ సముదాయ నాయకులు మూకయ్య స్వామి, హేమయ్య స్వామి, బళె మల్లికార్జున, విరుపాక్షి గౌడ, రేణుక గౌడ తదితరులు పాల్గొన్నారు.

కారటగి: కారటగి బసవేశ్వర నగర్‌లోని కిత్తూరు చెన్నమ్మ కూడలిలో జయంతిని నిర్వహించారు. నామఫలకానికి వేదమూర్తి హిరేమఠ మరుళ సిద్ధయ్య స్వామి పూజలు జరిపారు. అనంతరం ఆమె చిత్రపటాన్ని పట్టణంలోని వీధుల్లో ఊరేగించారు. కిత్తూరు రాణి చెన్నమ్మ వేషధారణలో పిల్లలు అలరించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జయంతి జరిగింది. పురసభ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పంచమసాలి సముదాయ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీరామనగర్‌లో: స్థానిక విద్యా నికేతన్ పాఠశాలలో జయంతిని ఆచరించారు. కిత్తూరు రాణి చెన్నమ్మ చిత్ర పటానికి విద్యా సంస్థ ఉపాధ్యక్షుడు నెక్కంటి ఆదర్శ పూజలు జరిపారు. పి.ఆర్.ఎం. నింగప్ప కిత్తూరు రాణి జీవితం గురించి విద్యార్థులకు వివరించారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు నమ్రత, నిత్యశ్రీ రాణి చెన్నమ్మ బాల్యం, ఆంగ్లేయులతో పోరాటం తదితర విషయాపై మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగావతి,న్యూస్‌టుడే: ఆంగ్లేయులను ఎదిరించి పోరాడిన స్వాతంత్ర్య యోధురాలు కిత్తూరురాణి చెన్నమ్మ జయంతిని కొప్పళలో బుధవారం ఘనంగా ఆచరించారు. ఆమె చిత్రపటం ఊరేగింపును శాసనసభ్యుడు రాఘవేంద్ర హిట్నాళ ప్రారంభించారు. అనంతరం జరిగిన వేదికపై శాసనమండలి సభ్యురాలు హేమలతా నాయక్ మాట్లాడుతూ రాణి చెన్నమ్మ మహిళా లోకానికి ఆదర్శం అన్నారు. లోక్‌సభ మాజీ సభ్యుడు సంగణ్ణ కరడి, కళకనగౌడ పాల్గొన్నారు.

వీర మహిళ రాణి చెన్నమ్మ

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ఆంగ్లేయుల పాలిట కిత్తూరు రాణి చెన్నమ్మ సింహ స్వప్నంగా మారి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీర వనిత అని తహసీల్దార్ విశ్వనాథ్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాణి చెన్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. గ్రేడ్-2 తహసీల్దార్ సత్యమ్మ, తాలూకా స్థాయి అధికారులు, బసవబళగ అధ్యక్షుడు డా.శివప్రకాశ్, సభ్యులు మల్లికార్జున, ప్రభు పాల్గొన్నారు.



హొసపేటెలో మాట్లాడుతున్న స్థానిక శాసనసభ్యుడు హెచ్.ఆర్.గవియప్ప

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు కిత్తూరు రాణి చెన్నమ్మ పేరు పెట్టాలన్న ప్రతిపాదనలను వెంటనే ప్రభుత్వానికి సమర్పిస్తామని స్థానిక శాసనసభ్యుడు హెచ్.ఆర్.గవియప్ప పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, కన్నడ, సాంస్కృతిక శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కొట్టూరుస్వామి మఠంలో ఏర్పాటు చేసిన కిత్తూరురాణి చెన్నమ్మ జయంత్యుత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారతీయుల స్వేచ్ఛ కోసం బ్రిటిష్ వారిపై పోరాటం చేసిన ప్రథమ మహిళ కిత్తూరు రాణి చెన్నమ్మ అని ఆయన గుర్తు చేశారు. ఆమె పేరును పాఠశాలలు, వసతి నిలయాలకు పెట్టడం సముచితమని అన్నారు. పట్టణంలోని దాతలు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖ వీధుల్లో కిత్తూరు రాణి చెన్నమ్మ చిత్రపటం ఊరేగింపు జరిగింది. ఈ ఊరేగింపులో కొట్టూరుమఠం ముప్పిన బసవలింగ స్వామీజీ, జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్, హుడా అధ్యక్షుడు మహ్మద్ ఇమామ్ నియాజి, తహసీల్దార్ శ్రుతి మళ్లప్పగౌడ తదితరులు పాల్గొన్నారు.



కిత్తూరు రాణి చెన్నమ్మ చిత్రపటం ఊరేగింపులో సంఘం ప్రముఖులు, కళాకారులు తదితరులు



సింధనూరులో రాణి చెన్నమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



కంప్లి: తహసీల్దార్ కార్యాలయంలో జయంతిలో పాల్గొన్న అధికారులు తదితరులు



శ్రీరామనగర్ విద్యా నికేతన్ పాఠశాలలో జయంతిలో పాల్గొన్న విద్యార్థులు



కొప్పళలో కిత్తూరురాణి చెన్నమ్మ ఉత్సవం ప్రారంభిస్తున్న శాసనసభ్యుడు రాఘవేంద్ర



సిరుగుప్ప కిత్తూరు రాణి చెన్నమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, సంఘ, సంస్థ ప్రతినిధులు



మాన్వి తహసీల్దార్ కార్యాలయంలో కిత్తూరు చెన్నమ్మ జయంతి

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

సైన్స్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

హొసపేటె, న్యూస్‌టుడే: పీయూసీ సైన్స్ విభాగం విద్యార్థులకు రోజూ ప్రత్యేక తరగతులు నడిపి, వారి ఫలితాలు మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ సూచించారు. జిల్లా పీయూ విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ పీయూసీ ఫలితాలు మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై ఏర్పాటు చేసిన ఉపన్యాసకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టెన్త్, పీయూసీ ఫలితాల్లో 2023-24వ విద్యా సంవత్సరంలో విజయనగర జిల్లా వెనుకబడింది. ఇప్పటి నుంచే ఉపన్యాసకులు విద్యార్థులపై ప్రత్యేక తరగతులను నడపాలని సూచించారు. సీఈటీ, నీట్‌లో రాణించేలా విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ ఇవ్వాలని తెలిపారు. కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. పీయూ విద్యా శాఖ ఉపసంచాలకుడు పాలాక్ష, నోడల్ అధికారి నాగరాజ్ హవల్దార్ పాల్గొన్నారు.

విశిష్టమైంది మన సంస్కృతి



అయ్యాచార దీక్ష తీసుకున్న పిల్లలతో శ్రీశైలం పీఠాధిపతి, ఇతర స్వామీజీలు

సిరుగుప్ప: మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని ఆచరిస్తే ఉత్తమ పౌరులుగా రూపుదిద్దుకునేందుకు దోహద పడుతుందని శ్రీశైలం పీఠాధిపతి డా.చన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య స్వామి పేర్కొన్నారు. పట్టణంలోని పినాకి ఆశ్రమం శివశక్తి సంస్థల శిక్ష భవనంలో బుధవారం జంగమ పిల్లలకు అయ్యాచార, లింగదీక్ష బోధించి స్వామీజీ ఆశీర్వచనం చేశారు. ఏడుపదివయసులో దీక్ష తీసుకుని నిత్యం ఉదయం స్నానం ఆచరించి శివపూజ చేస్తే ఉత్తమ పౌరులుగా రూపుదిద్దుకుంటారని పేర్కొన్నారు. వివిధ మఠాధిపతులు సిద్ధలింగ మహాస్వామి, వీరభద్ర శివాచార్య స్వామి, బసవభూషణ స్వామి, కుమార పండితారాధ్య స్వామి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంతోనే ఉత్తమ జీవనం



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది అబ్దుల్‌సాబ్

సిరుగుప్ప, న్యూస్‌టుడే: మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే ఉత్తమ జీవనం సాగించేందుకు సాధ్యపడుతుందని ఆరోగ్య శిక్షణాధికారి మహమద్ ఖాసిం పేర్కొన్నారు. పట్టణంలోని ప్రైవేట్ కళాశాల్లో బుధవారం న్యాయవాదుల సంఘం, ఆరోగ్య శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఆచరించారు. కార్యక్రమాన్ని ఇతర అతిథులతో కలిసి ప్రారంభించి ఆయన మాట్లాడారు. సీనియర్ న్యాయవాది అబ్దుల్‌సాబ్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో మీ చదువుతో పాటు ఉత్తమ పుస్తకాలను చదువుతూ వాటి సారాంశాన్ని తెలుసుకుని ఆచరించాలన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఉప్పార వెంకోబ, న్యాయవాదులు మహేశ్, మల్లిగౌడ, రుద్రముని, హులుగప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

అయోడిన్ ఆవశ్యకతపై అవగాహన జాతా



అయోడిన్ నియంత్రణ జాగృతి జాతాలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లిలో అయోడిన్ కొరత నియంత్రణ జాగృతి జాతా బుధవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ సమూదాయ ఆసుపత్రి నుంచి ప్రారంభమైన జాతా పట్టణంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. అయోడిన్ లోపాన్ని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాతా పొడవునా నినాదాలు చేశారు. క్షేత్ర ఆరోగ్య శిక్షణ అధికారి కె.శోభ, వైద్యులు మల్లేశప్ప, శ్రీనివాస్, విశ్వనాథ, ఉషా, నందిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ.. విద్యార్థి దుర్మరణం



చేతన్ (పాతచిత్రం)

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: కళాశాలకు పోయి ఇంటికి వెనుదిరిగి వస్తున్న విద్యార్థి ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ప్రథమ పీయూసీ చదువుతున్న విద్యార్థి చేతన్ (16) ప్రమాద స్థలంలోనే మృతి చెందిన సంఘటన హొసపేట జాతీయ రహదారిలో బుధవారం మధ్యాహ్నం జరిగిందని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. చేతన్ ఇక్కడి బ్యాంకు కాలనీ నివాసముంటున్న కృష్ణమూర్తి కుమారుడు. అతను ఎస్‌ఆర్ఎస్ కళాశాలకు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్నప్పుడు ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలిసిన వెంటనే సంచార పోలీసు ఠాణా అధికారులు ప్రమాదస్థలాన్ని సందర్శించి కేసును నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: ఈతకెళ్లిన యు.వెంకటేశ్(51) అనే వ్యక్తి కాలుజారి కాలువలో పడి మృతిచెందిన ఘటన పట్టణంలో జరిగింది. కౌల్‌పేటకు చెందిన కార్మికుడు వెంకటేశ్ తాగుడుకు అలవాటుపడ్డాడు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు తీవ్రంగా మందలించారు. ఇంటినుంచి వెళ్లిపోయిన అతను పట్టణ శివారులోని కాలువలో పడి కారణానికి వెళ్లాడనివైఎర్ మృతిచెందాడని పోలీసులు తెలిపారు. కమలాపుర పవర్‌కెనాల్‌లో మృతదేహం లభించింది. దీనిపై కమలాపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో కొట్టుకుపోయి వృద్ధుడు..

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: హొళల్కెరె తాలూకా రామఘట్ట గ్రామానికి చెందిన రాజప్ప(70) అనే వృద్ధుడు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటడానికి ప్రయత్నించి కొట్టుకుని పోయి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగిందని పోలీసులు తెలిపారు. బుధవారం వారు తెలిపిన వివరాల మేరకు.. రాజప్ప గేదెలను మేపుకుని రావడానికి పోయి వెనుదిరిగి వస్తుండగా హిరేహళ్ల వాగు ప్రవాహంలో చిక్కుకున్నాడు. నీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. మేతకు పోయిన గేదెలు ఇంటికి చేరుకున్నా రాజప్ప రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి సమీపాన ముళ్లకంప పొదల్లో రాజప్ప మృతదేహాన్ని గుర్తించారు. చిక్కజాజూరు పోలీసు ఠాణాలో కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

పిడుగుపడి గొర్రెల కాపరి విషాదాంతం

హొసపేటె: గొర్రెలు మేపుకొని ఇంటికి బయల్దేరుతున్న కాపరి బోరయ్య పిడుగుపాటుతో మృతిచెందిన ఘటన కూడ్లిగి తాలూకా గుడేకోట అటవీ ప్రాంతంలో జరిగింది. పొద్దుపోయాక బోరయ్య గొర్రెలను తోలుకుని ఇంటికి బయల్దేరుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడగా, పిడుగుపడి తలదాచుకున్నాడు. ఆ సమయంలో చెట్టుపైన పిడుగుపడటంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. ఈ ఘటనపై గుడేకోట పోలీస్ ఠాణాలో కేసు నమోదైంది.

ప్రాణాలు తీసిన మద్యం వ్యసనం

హొసపేటె, న్యూస్‌టుడే: తాగుడుకు అలవాటుపడిన నిర్మాణ కార్మికుడు రవికుమార్ (32), తాగటానికి డబ్బులేక తీవ్ర మనస్తాపంతో ఉరేసుకుని మృతిచెందిన ఘటన హగరిబొమ్మనహళ్లిలో మంగళవారం రాత్రి జరిగింది. వయస్సు మీదపడుతున్నప్పటికీ రవికుమార్‌కు పెళ్లికాలేదు. దాన్నే మనస్సులో పెట్టుకుని తాగుడుకు అలవాటుపడ్డాడు. తాగటానికి డబ్బులివ్వమని కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. వారు నిరాకరించినందుకు తీవ్ర మనస్తాపంతో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై హగరిబొమ్మనహళ్లి ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను మార్చాలని వినతి



అధికారికి పత్రం అందిస్తున్న రక్షణ వేదిక కార్యకర్తలు

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నిటిని ఒకే చోట ఏర్పాటు చేయాలని కర్ణాటక రక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం వేదిక కార్యకర్తలు తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి ఖాలిద్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. తాలూకా పంచాయతీకి నూతన భవనం సమకూరినందున పాత పంచాయతీ భవనంలోకి మహిళా శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ, సర్వేశాఖ, ఎస్సీ, ఎస్టీ శాఖల కార్యాలయాలను మార్చాలని కోరారు. ఈ భవనాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు దూరంగా ఉన్నాయని తెలిపారు. పాత పంచాయతీ భవనాన్ని వృథాగా వదిలివేయకుండా ప్రజలకు ఉపయోగ పడేవిధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

అరకెరాలో అడ్డపల్లకి మహోత్సవం

మాన్వి : అరకెరా గ్రామంలో డిసెంబరు 4న ధార్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సూగూరేశ్వరుడికి భక్తులు సమకూర్చిన నూతన రథం ప్రారంభోత్సవం, శ్రీశైల జగద్గురు అడ్డపల్లకి మహోత్సవం ఉంటుంది. సిరుగుప్ప పట్టణానికి వచ్చిన శ్రీశైలం జగద్గురు చన్నసిద్ధ రామ పండితారాధ్య శివాచార్య స్వామీజీని కలిసి ఆయనను నిర్వాహకులు ఆహ్వాన పత్రికను అందించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

23-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.92	1610.95
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	1,09,314	420
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	1,09,074	9,794
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.461	39.472

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

కొత్త వ్యవస్థ.. పనిచేయక అవస్థ

• చౌకదుకాణాల్లో సాఫ్ట్‌వేర్ అమలు • రేషన్‌కార్డుదారుల ఇబ్బందులు



చౌకదుకాణం వద్ద గుమిగూడిన కార్డుదారులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఆహార పౌర సరఫరాల శాఖ చౌకదుకాణాల్లో అమలు చేస్తున్న కొత్త సాఫ్ట్‌వేర్ సక్రమంగా పనిచేయక పోవడంతో రేషన్‌కార్డుదారులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. సెప్టెంబరులో కె-సర్వర్ సాఫ్ట్‌వేర్ ప్రవేశపెట్టింది. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మొదట బళ్లారి, దావణగెరె జిల్లాలను ప్రయోగాత్మకంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద తీసుకున్నారు. కె-సర్వర్ నిదానంగా పనిచేస్తోందని పలువురు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. పైగా రాష్ట్ర వ్యాప్తంగా 31జిల్లాల్లో కె-సర్వర్‌ను అక్టోబరు నుంచి అమలు చేయడం గమనార్హం. ప్రతి నెల మొదటి వారంలో చౌకదుకాణాల నుంచి రేషన్‌కార్డుల దారులకు సరకులు అందజేస్తారు. ఈ నెల కొత్త సాంకేతిక పరిజ్ఞానం సక్రమంగా పనిచేయకపోవడంతో మూడో వారం వచ్చినా 50 శాతం సరకులు సైతం పంపిణీ చేయలేదు. ఫలితంగా రేషన్ డీలర్లతో పాటు కార్డుదారులు చౌకదుకాణాల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 3,01,180 రేషన్ కార్డులు

జిల్లాలోని బళ్లారి, కురుగోడు, సండూరు, సిరుగుప్ప, కంప్లి తాలూకాల్లో మొత్తం 3,01,180 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో ఏఏవై రేషన్‌కార్డులు 21,081, పీహెచ్ కార్డులు 39,154, బీపీఎల్ కార్డులు 2,40,945 ఉన్నాయి. ప్రభుత్వం ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం, జొన్నలు లేకుంటే రాగులు ఇస్తోంది. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 3 వరకు బిల్లులు చెల్లించడంతో 4వ తేదీ సరకులను ఆయా చౌకదుకాణాలకు చేరుస్తారు. 6 నుంచి దుకాణాల్లో కార్డుదారులకు సరకులు పంపిణీ చేస్తారు. 15వ తేదీలోపు 90 శాతం మందికి సరకులు అందజేస్తారు. మిగిలిన వారికి మూడో వారంలో పూర్తి చేస్తారు. కొత్త సాంకేతికత కె-సర్వర్‌ను అమలు చేస్తుండటంతో ఈనెల 23వ తేదీ వరకు 50 శాతం పంపిణీ కూడా పూర్తి చేయలేపోతు న్నారు. పాత సాంకేతికతతో ఒక్కొక్కరికి 5 నుంచి 10 నిమిషాలు పట్టేది. కొత్త సాఫ్ట్‌వేర్ ఒక్కొక్కరికి గంట నుంచి రెండు గంటల సమయం తీసుకుంటోంది. నిత్యం కూలి పనులకు వెళ్లే వారు పనులు వదులుకొని చౌక దుకాణాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు



ఎన్.ఐ.సి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కె-సర్వర్ తీసుకుని రావడంతో సర్వర్ నెమ్మదిస్తోంది. ఫలితంగా రేషన్‌కార్డుదారులు చౌకదుకాణాల వద్ద పనులకు వెళ్లకుండా పడిగాపులు కాస్తున్నారు. 23వ తేదీకి సుమారు 90శాతానికిపైగా పూర్తిగా రేషన్ పంపిణీ చేయాలి. 50 శాతం పంపిణీ కూడా కాలేదు. రేషన్‌కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. డీలర్లు చౌకదుకాణంలో కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- వెంకటేష్ హెగ్డె, రేషన్ డీలర్, కాకర్లతోట బళ్లారి



చెట్ల కింద పడిగాపులు కాస్తున్న రేషన్‌కార్డుదారులు

ఇబ్బందులను తొలగిస్తాం

2009 నుంచి ఒకే సాఫ్ట్‌వేర్ ఉపయోగించడం వల్ల కొద్దిగా ఇబ్బందిగా ఉండేది. పాత సాఫ్ట్‌వేర్‌ను పలు కంపెనీలు ఉపయోగించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం కె-సర్వర్‌ను తీసుకొచ్చి మొదటిసారిగా బళ్లారి, దావణగెరె జిల్లాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు చేస్తున్నారు. కె-సర్వర్ బాగుందని 31 జిల్లాల్లో ఈ నెల నుంచి ప్రవేశపెట్టారు. ఒకసారి ఈ పరిజ్ఞానాన్ని వినియోగిస్తుండటంతో నెమ్మదిస్తోంది. బెంగళూరులో భారీ వర్షాలు పడటంతో కె-సర్వర్ పనితీరు మందగించిందని నిపుణులు తెలియజేస్తున్నారు. వచ్చే నెల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

- సకీనా, ఆహార పౌరసరఫరాశాఖ ఉపనిర్దేశకుడు, బళ్లారి

అయోడిన్ లోపాన్ని నివారించాలి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: మనిషి దేహంలో అయోడిన్ లోపం ఉంటే ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని ప్రభుత్వ వైద్యురాలు పల్లవి పేర్కొన్నారు. జిల్లా, తాలూకా పంచాయతీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అయోడిన్ లోపంపై అవగాహన కార్యక్రమాన్ని సీఏఎన్ పాఠశాలలో నిర్వహించారు. అయోడిన్ లోపంతో వచ్చే రోగాలపై గోడ పత్రిక ఆవిష్కరించి ఆమె మాట్లాడుతూ అయోడిన్ శరీరానికి అవసరమైన సూక్ష్మ పోషకాలను ఆహారం రూపంలో అందిస్తుందని, అది లోపిస్తే శారీరక, మానసిక రోగాల బారిన పడాల్సి వస్తుందన్నారు. అవసరమైన అయోడిన్ నాణ్యమైన ఉప్పులో లభిస్తుందన్నారు. అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సిరుగుప్పలో అయోడిన్ గోడ పత్రికలు ప్రదర్శిస్తున్న వైద్యులు, ఉపాధ్యాయులు



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దళిత సముదాయాల సమాఖ్య నాయకులు

న్యాయస్థానం ఆదేశాన్ని అమలుచేయండి

కంప్లి, న్యూస్‌టుడే: దళిత సముదాయ వర్గీకరణ విషయంలో న్యాయస్థానం ఆదేశాన్ని అమలుచేయాలని డిమాండు చేస్తూ దళిత వర్గీకరణ పోరాట సమాఖ్య నాయకులు డిమాండు చేస్తున్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రికి రాసిన వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్‌కు బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దళిత సముదాయ జనసంఖ్య ఆధారంగా వర్గీకరణ చేపట్టాలని మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా న్యాయస్థానం ఆదేశాన్ని గౌరవించి మంత్రివర్గ సమావేశంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. సమాఖ్య నాయకులు కరియప్ప గుడిమని, సి.బసవరాజ్, హెచ్.మరిస్వామి, ఎం.సి.మాయప్ప, బి.చన్నబసవ, బసప్ప పాల్గొన్నారు.

అశాస్త్రీయ వర్గీకరణను రద్దు చేయాలి

సిరివార, (మాన్వి) : రిజర్వేషన్ల అమలుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కొన్ని సంఘాల ప్రముఖులు, నాయకులు చేస్తున్న డిమాండ్ అర్థరహితమని అఖిల కర్ణాటక బంజార సేవా సమితి ఆరోపించింది. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. ఎస్సీల్లోని 101 సముదాయాల ఆర్థిక, సామాజిక, శైక్షణిక ప్రాతినిధ్యంపై అధ్యయనం చేయకుండా కొందరి ప్రయోజనం కోసం వర్గీకరణ చేశారని, ఇది ఏక పక్ష నిర్ణయమని నిందించారు. అలెమారి, కొరమ, కొరవ, కొరచ, భోవి సముదాయాలకు మద్దతుగా బంజార సేవా సమితి పోరాడుతుందని తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు హౌసేశ్ పవార్, వెంకటేశ్ పవార్, అమరేశ్‌పవార్, శేఖరప్పపవార్, గంగప్ప రాథోడ్, శివప్ప రాథోడ్, రెడ్డప్ప, శేఖరప్ప కారబారి, పరమేశ్ రాథోడ్, శివకుమార్ చౌహాణ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్యకర్తలు

విమానాశ్రయానికి తొలగిన అడ్డంకులు



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ

మాన్వి: రాయచూరు విమానాశ్రయానికి ఉన్న కొన్ని అడ్డంకులు తొలగాయి. విమానాశ్రయం పనులు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం తొలిదశ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో రాయచూరు గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి మార్గం సుగమమైంది. తొలిదశ నిర్మాణం పనులకు అనుమతులు మంజూరు చేసిన కేంద్ర విమానయానశాఖ మంత్రి కె.రామోహన్‌నాయుడును రాయచూరు లోక్‌సభ సభ్యుడు జి.కుమార్‌నాయక్, యువకాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకోవల్సిందిగా కేంద్ర మంత్రి నాయుడు సూచించారని ఎంపీ నాయక్ వెల్లడించారు.

కురుగోడులో కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతి



కురుగోడు తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతిని నిర్వహించారు. తహసీల్దార్ నరసప్ప, ఉప తహసీల్దార్ మల్లేశప్ప, సిబ్బంది చంద్రప్ప, శ్వేత, లత, స్వాతి, రాజేశ్వరి తదితరులు కిత్తూరు రాణి చెన్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కిత్తూరు రాణి చెన్నమ్మ జీవిత చరిత్రను వివరించారు. **- న్యూస్‌టుడే, బళ్లారి**

తేరువీధిలో అక్రమ కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాలు తొలగించిన పాలికె సిబ్బంది

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికెలో రహదారులు, ఫుట్‌పాత్‌లపై వెలసిన అక్రమ కట్టడాలను అధికారులు తొలగిస్తున్నారు. మేయర్ ముల్లంగి నందీష్, కమిషనర్ ఖలీల్ సాబ్ ఆదేశాలతో ప్రతి బుధవారం నగరంలో అక్రమ కట్టాలు తొలగించాలని నగర పాలికె సాధారణ సమావేశంలో తీర్మానించారు. ఉదయం స్థానిక తేరు వీధిలో ఫుట్‌పాత్‌లపై నిర్మించిన మెట్లు, డబ్బా దుకాణాలు, బోర్డులు, తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేస్తున్న బండ్లను తొలగించారు. తేరు వీధిలో నగర పాలికె అధికారులు తొలగింపును కొంత మంది అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అందరి సౌకర్యాల కోసం అక్రమ కట్టడాలను తొలగించి, వాహనాల రాకపోకలకు అనుకూలం చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



అక్రమ కట్టడాలను అడ్డుకోవడానికి వచ్చిన వ్యాపారులు



కొప్పళలో కేకేఆర్‌డీబీ పనుల ప్రగతిని సమీక్షిస్తున్న మండలి అధ్యక్షుడు అజయ్‌సింగ్

కేకేఆర్‌డీబీ పనుల పూర్తికి ఆదేశం

గంగావతి, న్యూస్‌టుడే: కొప్పళ జిల్లాలో కేకేఆర్‌డీబీ పనులను సకాలంలో పూర్తిచేయాలని మండలి అధ్యక్షుడు అజయ్‌సింగ్ సూచించారు. ఆయన బుధవారం కల్యాణకర్ణాటక అభివృద్ధి మండలి పనుల ప్రగతిని సమీక్షించారు. 2018 నుంచి 2021 దాకా విడుదలైన నిధులకు సంబంధించిన పనుల జాప్యంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. జిల్లా రంగమందిరం నిర్మాణాన్ని 15 రోజుల్లో పూర్తి చేయాలని గడువు విధించారు. సెప్టెంబరు 17న కలబురగిలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో కల్యాణ కర్ణాటకకు 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కేటాయించినట్లు చెప్పారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన ఆరోగ్య కేంద్రాల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలన్నారు. కుంటి సాకులతో పనులను జాప్యం చేయరాదంటూ ఏవైనా సమస్యలు ఉంటే నిధులను ఇతర పనులకు మళ్లించాలని సూచించారు. జిల్లా పాలనాధికారి, జడ్పీ సీఈవోలు పనుల్లో వేగం పెంచే చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి, శాసనసభ్యులు దొడ్డనగౌడ, రాఘవేంద్ర హిట్నాళ, పాలనాధికారి నళిన్ అతుల్, జడ్పీ సీఈవో రాహుల్‌రత్నం పాండే పాల్గొన్నారు.

విద్యుత్తు కోతలపై జెస్కాం అధికారుల నిలదీత



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న కమిషనర్ చంద్రప్ప

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టణంలో విపరీతమైన విద్యుత్తు కోత విధిస్తున్నారు, తాగునీటి సరఫరాకూ ఇబ్బందులు వచ్చి పడుతున్నాయని నగరసభ సభ్యులు జెస్కాం అధికారులను నిలదీశారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సాధారణ సమావేశంలో విద్యుత్తు కోతలపై వాడీవేడి చర్చలు జరిగాయి. సభ్యులు మహ్మద్ గౌస్, హనుమంతప్ప, హులుగప్ప, లతాసంతోష్ తదితరులు మాట్లాడుతూ పట్టణంలో అప్రకటిత విద్యుత్తు కోత విధిస్తున్నారు. దీంతో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నీటి సరఫరా కోసం ప్రత్యేకించిన విద్యుత్తు లైనులోనూ సరఫరా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ప్రతి వార్డులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జెస్కాం అధికారులు కన్నెత్తి చూడటంలేదని ధ్వజమెత్తారు. జెస్కాం ఏఈఈ హేమరెడ్డి సమాధానం ఇస్తూ. మొన్న వీసిన ఈదురు గాలులతో విద్యుత్తు లైన్లలో సమస్యలు వచ్చి పడ్డాయి. ప్రాధాన్యత వారీగా వాటిని సరిచేస్తున్నాం. త్వరలో సమస్య ఓ కొలిక్కి వస్తుందని భరోసా ఇచ్చారు. నగరసభ పరిధిలోని వాణిజ్య సముదాయాల టెండర్ వ్యవధి ఎప్పుడో ముగిసింది. అయినప్పటికీ వాటిని పునః టెండర్ వేయకుండా పాత వ్యాపారులనే కొనసాగిస్తున్నారు. దీనివల్ల నగరసభ ఆదాయానికి గండిపడుతోందని సభ్యులు వాపోయారు. త్వరలో వాటి టెండర్ ప్రక్రియ పూర్తిచేస్తామని కమిషనర్ చంద్రప్ప హామీ ఇచ్చారు. అధ్యక్షుడు ఎన్.రూపేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రమేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అడుగేస్తే బురద.. మీకేమి పట్టదా



రెవెన్యూశాఖ కార్యాలయం వద్ద బురద

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర నడిబొడ్డున ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణ చిన్నపాటి వర్షానికే బురద కుంటలా మారుతోంది. ఆవరణలోని కార్యాలయాలకు అధికారులు, సిబ్బంది, ప్రజలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. ఆవరణలోని కార్యాలయాలను మొత్తం వేరే ప్రాంతాలకు తరలించాలని సోషియల్ యాక్షన్ క్లబ్ అధ్యక్షుడు మేకల ఈశ్వర్‌రెడ్డి నేతృత్వంలో డీసీ, తహసీల్దార్లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ తాలూకా కార్యాలయం, గ్రామీణ పోలీస్ స్టేషన్, ఉద్యోగ వినిమయ కేంద్రం, బ్రూస్‌పేటె పోలీస్ స్టేషన్, దేవాదాయశాఖ కార్యాలయం, రెవెన్యూశాఖ కార్యాలయం ఉన్నాయి. ఈ కార్యాలయాలకు నూతన సంకీర్ణ భవనంలోకి మార్చాలని కోరినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వసుధేంద్ర తీర్థ మధ్యారాధన



అలంకరణలో వసుధేంద్ర తీర్థ మూల బృందావనం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: వసుధేంద్ర తీర్థ మధ్యారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కెంచన గుడ్డ పరిధిలో తుంగభద్ర తీరాన ఉన్న శ్రీ వసుధేంద్ర తీర్థ 262వ ఆరాధాన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామి పాల్గొని మూల విరాట్‌కు నవగ్రహ పూజలు నిర్వహించారు. మధ్యారాధన పురస్కరించుకుని ఉదయాన్నే వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితులతో ప్రవచన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆరాధన ఉత్సవంలో పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మంత్రాలయ పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామి

రేపు కర్నూలు తాత ఉరుసు



గంగావతిలో కర్నూలు తాత దర్గా

గంగావతి, న్యూస్‌టుడే: గంగావతి కర్నూలు తాత ఉరుసు ఈనెల 25న ఆచరిస్తామని దర్గా సమితి ఒక ప్రకటనలో తెలిపింది. 24న సాయంత్రం గంధం ఊరేగింపు జరుగుతుందన్నారు. బేరుణా ఆబాది మసీదు నుంచి ఈ ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. 25న ఉరుసు, 26న జియారత్, ఫతేహ ఆచరిస్తారన్నారు. ఈ సందర్భంగా ముంబయికి చెందిన సలీంరాజా ఖవ్వాలి కచేరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మతసామరస్యం చాటిన కర్నూలు తాత ఉరుసులో అన్ని వర్గాల వారు పాల్గొనాలని కోరారు.

రామయ్య వరుణార్భాటం!


ముఖ్యమంత్రి ఓ మహిళా రైతు స్వీయచిత్రేక్షణం..

బెంగళూరు గ్రామీణం, న్యూస్‌టుడే : రోమ్‌నగరం తగలబడుతోంటే.. అంటూ ఏలికల నిర్లక్ష్యంపై తరచుగా వ్యంగ్యోక్తులు విసరడం షరామామూలే. అలాంటి విమర్శలే ఎదుర్కొనేందుకు వరుసలో ఉత్సాహంగా నిలుచున్నారు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య! బడుగు, బలహీన వర్గాల మనిషిగా నిత్యం తనకుతానే ప్రకటించుకునే ఆయన ప్రజాపాలకుడిగా తన బాధ్యతలను తరచుగా మరచిపోవడం ఇటీవల విమర్శలను మూటగట్టుతోంది. సోమవారం అర్ధరాత్రి నుంచి బెంగళూరును వరుణుడు ఉక్కిరిబిక్కిరి చేసి.. మూడు చెరువుల నీరు తాగించాడు. ఇంత కష్టం నగరవాసిని చుట్టుముట్టిన వేళ యంత్రాంగాన్ని ముందుకు నడుపుతూ రామయ్య తన రాజ్యభారాన్ని నిండుగా నిభాయించాల్సిన సమయంలో- ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం రాచనగరి పర్యటనకే పయనమయ్యారు. అందులోనూ సొంత నియోజకవర్గం 'వరుణ'లో తనవారి జయజయనాదాల మధ్య మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. పొద్దుగూకే సమయానికి కాంగ్రెస్ అధినాయకగణం- సోనియాగాంధీ, ప్రియాంకా తదితరులు కదలిరావడదంతో వారి స్వాగత సత్కార్యాలకు సమయం సరిపోలేదు. ఆపై.. బుధవారం ఉదయమే కేరళలోని వయనాడ్‌కు పయనమై కదిలారు. 'వరుణ'లో ఎంతో ఉత్సాహంగా గడుపుతున్న సమయంలోనే రాజధానికి 'వరుణుడు' చేసిన గాయం తాలూకు వివరాలు తెలిసినా అటు తొంగిచూసే తీరిక లేకుండా పోయింది. 'అధికారులు ఆ పనిలో నిమగ్నమై ఉన్నారులే..' అన్నంత నమ్మకం ఆయనలో దండిగా కనిపించింది. రాజధానిలో రహదారులు, తాగునీటి వ్యథలు, మౌలిక వసతుల కొరతను ఎత్తిచూపుతూ ఐటీ, బీటీ సంస్థల యాజమాన్యాలు అనేక దఫాలుగా ఒంటికాలిపై లేచిన దాఖలాలు రామయ్యకు తెలియనివి కాదు. రాష్ట్రానికి ప్రధాన ఆర్థికవనరైన ఐటీ రంగానికి ఊతమిచ్చే బెంగళూరును రక్షించుకునే అవసరానికన్నా.. అధినాయకత్వాన్ని మెప్పుపొందడం తప్పనిసరిగా పొందడం విషాదాంకం.


ఏకకాలంలో ఆవిష్కరించిన వివిధ శాఖల శిలాఫలకాలు


సిద్ధూ.. ఇటు చూడు : బెంగళూరు శివారు యలహంకలో వాననీటిలో నిండా మునిగిన ఓ కాలనీ


సిద్ధు

● వరుణ నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలనే రామయ్య కల కాదనలేనిది. మైసూరు నగరానికి సరిహద్దుగా విస్తరించిన ఈ ప్రాంతానికి కంటికి రెప్పలా ఆయన సేవ చేస్తున్నారు. ఐదు గ్యారంటీ పథకాలు ప్రారంభించాక.. నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు కరవయ్యాయని ఎమ్మెల్యేలంతా ఏకరువు పెడుతుండగా.. ఇక్కడ వివిధ పనుల కోసం మంగళవారం ఏకంగా రూ.501 కోట్లు వెచ్చించారు. వరుణుడు పెట్టిన ఇక్కట్లలో నలిగిపోతున్న రాజధాని దిశగా కన్నెత్తి చూడకుండా 'వరుణ' వేడుకలకే కదలడం ఆశ్చర్యకరమే.

● ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వరద ఎక్కువైందని విపక్షాలు దుయ్యబట్టాయి. యుద్ధ ప్రాతిపదికన బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మైసూరులో తెలిపారు. 'అకాల వర్షాలతో దుబాయి, దిల్లీలోనూ వరదలు వచ్చాయి. బెంగళూరు అందుకు అతీతం కాదు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ వెళుతున్నాం. రాజకాలువపై కబ్జాలను తొలగిస్తున్నాం. ప్రకృతిని నియంత్రించలేని పరిస్థితి. ప్రస్తుతం నేను అధికారులకు సూచనలిస్తూ పరిస్థితులను సమీక్షిస్తున్నా' అని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు నగరంలో 15.5 సెం.మీ. రికార్డుస్థాయి వర్షం కురిసిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నగరంలోని బసవసమితి లేఅవుట్, టాటా నగర, భద్రప్పలేఅవుట్, వాయునందన లేఅవుట్, ఆంజనేయ లేఅవుట్, చిత్రకూట లేఅవుట్, కోరమంగల, హెచ్ఎస్ఆర్ లేఅవుట్, సర్జాపుర, మడివాళ తదితర ప్రాంతాల్లోనూ వరద నీటితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దారులు.. గాడినపడేదెన్నడు?

నేటిచిత్రం

బెంగళూరు నగరంలో వరుసగా కురుస్తున్న వర్షాలు.. రహదారులను ధ్వంసం చేస్తున్నాయి. ఈ రెండు నెలల్లో రూ.688 కోట్లు ఖర్చు చేసి వివిధ రహదారులను మరమ్మతు చేస్తే.. నేడు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. తారుతో మాసికలు (ప్యాచ్) వేసిన 85 శాతం ప్రాంతాల్లో మళ్లీ గుంతలు పడ్డాయి. ఈ నిధులను గుంతలు పూడ్చేందుకు కాకుండా మహారాష్ట్రలో ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ కోసమే విడుదల చేసినట్లు ఉందంటూ విపక్షాల కార్యకర్తలు పోస్టర్లను విడుదల చేసి, కొన్ని గుంతల వద్ద ప్రదర్శించారు. వర్షం కురుస్తున్న సమయంలోనూ నీటిలో మునిగి ఉన్న గుంతల్లో పడి పలువురు వాహనదారులు గాయాల పాలయ్యారు. సోమ, మంగళవారాల్లో కురిసిన వానలకు ఉత్తర బెంగళూరు ప్రాంత రహదారుల పొడవునా వాగులు ప్రత్యక్షమయ్యాయి. వాననీటి తాకిడికి ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో యలహంక పరిస్థితిలో రాకపోకలకు ఇక్కట్లు మొదలయ్యాయి. ప్రయాణికుల గోడు వర్ణనాతీతం. ఏలికలూ.. ఈదారులను దారికి తెచ్చేదెన్నడు?

-న్యూస్‌టుడే, బెంగళూరు గ్రామీణం


మా బ్రాండ్ బెంగళూరు నిధులు.. మహారాష్ట్ర ఎన్నికలకు మళ్లింపు.. అంటూ వ్యంగ్యాస్త్రాలు


నాగరబావి సర్వీసు రోడ్డులో ఇటీవల వేసిన తారు వర్షం దెబ్బకు కొట్టుకుపోయాక మిగిలిందిలా

తటాకాల తుళ్లింత.. భూమాత పులకింత!


మొన్నటిదాకా ఎండి.. నేడు నిండిన నాగవార చెరువు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు నిండు కుండల్లా మారిపోతున్నాయి. మొన్నటి ఎండాకాలంలో తడారి.. ఎండిపోయి కనిపించినవన్నీ నేడు కొత్తనీటితో కళకళలాడుతున్నాయి. చెరువుల్లోకి వాన నీరు పొంగి ప్రవహించి వచ్చాక పరిసరాలకే కొత్త అందాలు వచ్చాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం అమాంతం పెరిగిందని పర్యావరణ శాఖ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు భూగర్భ జలాల మట్టం క్షీణించి.. పనికిరాకుండా పోయిన 1738 బోరుబావులు నేడు చైతన్యవంతమైనట్లు బెంగళూరు జలమండలి అధికారులు ప్రకటించారు. శివార్లలో తాగునీటి ఎద్దడిని ఈ వర్షం తీర్చినట్లేనని సంతోషం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు కొనసాగిన ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పనులను నిలిపివేశామని వివరించారు. అపార్ట్‌మెంట్లకు అనుబంధంగా ఉన్న బోరుబావుల్లో నీరు వృద్ధి చెంది, ఇక్కట్లు తీరాయి. అనేక ప్రాంతాల్లో ఈసారి వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టడంతో భూగర్భజలాల మట్టం పెరిగిందని గుర్తించారు. రెండువారాల నుంచి ఎడతెరిపిలేకుండా నిత్యం చినుకులు రాలుతున్నాయి. చుట్టుపక్కల ప్రదేశాలు పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. నగర మధ్యభాగంలో 13 చెరువులు ఉండగా శివార్లలో 32 విస్తరించాయి. వాటిల్లో 12 పూర్తి స్థాయిలో నిండగా పదింట సగం, మిగతా వాటిలో ఓమోస్తరు వాననీరు నిలిచింది. ప్రజలు, పశువులకు తాగునీటి కొరత లేకుండా పోయిందని పాలికె చెరువుల నిర్వహణ అధికారులు తెలిపారు. కెంపాబుద్ధి, పుట్టనహళ్లి, సారక్కి, మహదేవపుర తదితర చెరువుల్లో పూడిక తొలగించడంతో నిల్వ స్థాయి పెరిగింది. హెబ్బాళ్, యలహంక, నాగవార, హలసూరు, బెట్టహళ్లి, జక్కూరు, కృష్ణరాజపురం, వైట్‌ఫీల్డ్, దాసరహళ్లి, అబ్బిగెరె, సోలదేవనహళ్లి, అగర, మడివాళ, యడియూరు తదితర తటాకాల్లో వాననీరు తొణికిసలాడుతోంది. వాటి సమీపానికి వివిధ ప్రాంతాలనుంచి పక్షుల రాక మొదలైనట్లు అధికారులు తెలిపారు.


బెట్టహళ్లి చెరువు అభివృద్ధి చేశాక నిండిందిలా


జక్కూరు చెరువు.. నగర వాకిట జలదరువు



గంగమ్మకు వాయనం

బెంగళూరు యశ్వంతపుర పరిధి హెరోహళ్లి చెరువు కొత్త నీటితో కళకళలాడుతోంది. చెరువు వెనుకజలాల్లో గంగమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, శాసనసభ్యుడు ఎస్.టి.సోమశేఖర్ ఆధ్వర్యంలో వాయనం సమర్పించారు. నిండుకుండలా ఉన్న చెరువు ఒడ్డున మహిళా కార్యకర్తలు పూజలు చేశారు. -న్యూస్‌టుడే, కెంగేరి

బెంగళూరు విపణిలో



కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

● బీన్స్-	125
● క్యారెట్-	65
● బీరకాయలు-	45
● క్యాబేజి-	15
● కాలీఫ్లవర్(ఒక్కోటి)-	15
● సొరకాయ-	35
● దొండకాయలు-	35
● పొట్లకాయ-	35
● టమాటా(నాటు)-	70
● టమాటా-	50
● గుమ్మడి-	35
● ఆలుగడ్డ-	40
● ఉల్లి (మేలురకం)-	75
● ఉల్లి (మాములు)-	60
● వెల్లుల్లి-	420
● సాంబారు ఉల్లి-	120
● బీట్‌రూట్-	25
● వంకాయలు-	35

ఐఏఎస్ అధికారుల బదిలీ

శివాజీనగర, న్యూస్‌టుడే : వివిధ శాఖల్లో సేవలు అందిస్తున్న ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులు.. వారికి కేటాయించిన కొత్త శాఖల వివరాలు ఇలా ఉన్నాయి. మహ్మద్ జైన్ (ప్రధాన అధికారి, కర్ణాటక పర్యవేక్షణ, మౌల్యమాపక ప్రాధికార), రమణదీప్ చౌధరి (కార్యదర్శి, కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్), సుమనా గోడబోలె (కార్యదర్శి, కర్ణాటక సమాచార కమిషన్), నితేశ్ పాటిల్ (కమిషనర్, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం), హెచ్.బసవరాజేంద్ర (అధ్యక్షుడు, కర్ణాటక పాఠశాల పరీక్ష, మూల్యాంకన మండలి), లోఖండె స్నేహల్ సుధాకర్ (జాయింటు కంట్రోలర్, కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్), ఏబీ బసవరాజ్ (ఉప కార్యదర్శి మౌలిక అభివృద్ధి శాఖ), ఎస్ రంగప్ప (అదనపు డైరెక్టర్, ఆర్థిక విధాన సంస్థ).

ఆసుపత్రిలోనే బిడ్డను వదిలేశారు

కోలారు, న్యూస్‌టుడే : చికిత్స కోసం ఎక్కువ నగదు చెల్లించలేక నాగరాజు, రంగమ్మ దంపతులు తమ ఐదు నెలల ఆడపిల్లను బెంగళూరులోని ఇందిరాగాంధీ పిల్లల ఆసుపత్రిలో విడిచి వెళ్లిపోవడం కలకలం రేపింది. నెల్లూరుకు చెందిన ఈ దంపతులు కోలారులో ఉంటున్నారని అనుమానిస్తున్నారు. తమ బిడ్డకు ఉన్న శ్వాసకోశ సంబంధిత సమస్యకు చికిత్స కోసం కోలారులోని ఆర్ఎల్ జాలప్ప ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ కోలుకోక పోవడంతో బెంగళూరు ఆసుపత్రిలో విడిచి వెళ్లారని గుర్తించారు. కోలారు, కేజీఎఫ్ పోలీసుల సహకారంతో ఆడబిడ్డను సంక్షేమ శాఖ హాస్టల్‌కు తరలించారు.

స్నానాలగది కూలి యువతి మృతి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పునాదుల్లోకి నీరు చేరి స్నానాల గది గోడ కూలి శిథిలాల కింద చిక్కుక్కుని సహన (27) అనే యువతి మరణించింది. తుమకూరు జిల్లా గుబ్బి తాలూకా జీ హోసహళ్లి గ్రామంలో బుధవారం ఉదయం ఈ ఘటన సంభవించింది. శిథిలాల కింద నుంచి తీసి, ఆసుపత్రికి తరలించేలోగా సహన మరణించింది. గుబ్బి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నన్నూ మేయరును చేయండి!

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : తనను మేయరు చేయాలని ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని మురళీకృష్ణ బ్రహ్మానందం (66) అనే వ్యక్తి ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ల్యావెల్లీ రోడ్డుకు చెందిన ఆయన అర్జీ బుధవారం విచారణకు వచ్చింది. విచారణకు మురళీకృష్ణ హాజరు కాలేదు. అర్జీని తోసిపుచ్చాలని ప్రభుత్వ న్యాయవాది చేసిన విన్నపాన్ని జస్టిస్ ఎన్‌వీ అంజారియా, జస్టిస్ కేవీ అరవింద్‌లు పరిగణనలోకి తీసుకోలేదు. అర్జీ వేసిన మహానుభావుడ్ని తాము చూడాలని అనుకుంటున్నామని చెప్పి తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

చెల్లిపై అక్క దాష్టీకం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బాయ్ ఫ్రెండుతో కలిసి నగదు కోసం తనను బెదిరిస్తున్న అక్కపై ఒక వివాహిత (37) కెంగేరి ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో అక్క, ఆమె స్నేహితునితో పాటు ఫిర్యాదు చేసిన మహిళ బాయ్‌ఫ్రెండ్‌పై కూడా కెంగేరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. తన అక్క స్నేహితుడ్ని వారింట్లోనే రెండేళ్ల కిందట కలుసుకుంది. అప్పటి నుంచి ఆయనతో స్నేహంగా ఉండేది. మరో వైపు బాల్య స్నేహితునితోనూ స్నేహాన్ని కొనసాగించింది. అతనితో వీడియో కాల్ చేసి మాట్లాడేది. కొన్ని వ్యక్తిగత వీడియో కాల్స్, ఫొటోలను అడ్డు పెట్టుకుని బాల్య స్నేహితుడు బెదిరించడం మొదలుపెట్టాడు. అనంతరం వివాహిత అక్క, ఆమె స్నేహితునితోనూ చేతులు కలిపి బెదిరింపులను తీవ్రం చేశాడు. తమకు రూ.80 వేలు ఇవ్వకపోతే వాటిని నీ భర్తకు ఇస్తామని, సామాజిక మాధ్యమాల్లో ఉంచుతామని బెదిరించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది.

రామాంజనేయుడికి మహా పూజలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాజాజీనగర రామమందిరం ఆవరణలో 63 అడుగుల ఎత్తైన శ్రీరామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ప్రక్రియ బుధవారంతో పూర్తయింది. విశ్వేశ ప్రసన్న తీర్థ స్వామి, ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామి, సౌమ్యనాథస్వామి పూజా క్రతువులను కొనసాగించారు. నగరానికి వచ్చే భక్తులకు ఇది తీర్థ ప్రదేశం అవుతుందని నిర్మలానందనాథ స్వామి ఆశీర్వదించారు. శ్రీరాముని ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, మల్లేశ్వరం ఎమ్మెల్యే డాక్టర్ అశ్వత్థనారాయణ, శ్రీరామసేవా మండలి అధ్యక్షుడుడు శ్రీధర్, మండలి సభ్యులు ఆర్‌వీ హరీశ్, సావిత్రి సురేశ్ కుమార్, హెచ్ఎం కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్లు మోహన్ కుమార్, మంజునాథ్, దీపా నాగేశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


భారీ విగ్రహం వద్ద విశ్వేశ ప్రసన్నతీర్థ స్వామి, యడియూరప్ప తదితరులు

బెంగళూరు కంబళకు రాంరాం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : అక్టోబరు 26 (శనివారం)న తాము బెంగళూరులో కంబళ పోటీలను నిర్వహించడం లేదని 'బెంగళూరు కంబళ' నిర్వహణ సమితి ఉన్నత న్యాయస్థానానికి ప్రమాణ పత్రాన్ని అందజేసింది. ప్యాలెస్ మైదానంలో కంబళను నిర్వహించేందుకు అనుమతి ఇవ్వకూడదని 'పెటా' ఒక వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి ప్రాంతాల నుంచి దున్నపోతులను నగరానికి తీసుకురావడం, పోటీల అనంతరం వాటిని తరలించడం హింసతో కూడుకున్న వ్యవహారమంటూ పెటా ఆక్షేపణలు వ్యక్తం చేసింది. కంబళ సంస్కృతిని అందరికీ తెలియజేసేందుకే వివిధ ప్రాంతాల్లో ఈ క్రీడను నిర్వహిస్తున్నామని సమితి ప్రతినిధులు తెలిపారు. పెటా లేవనెత్తిన వివాదం, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ప్యాలెస్ మైదానంలో పోటీలను నిర్వహించకూడదని నిర్ణయించామని ప్రమాణ పత్రంలో పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ ఎన్‌వీ అంజారియా తదుపరి విచారణను నవంబరు మొదటి వారానికి వాయిదా వేశారు.

నియంత్రణలోకి అతిసారం

హొసపేటె, న్యూస్‌టుడే: హరపనహళ్లి తాలూకా టి.తుంబిగెరెలో వాంతులు, విరేచనాల కేసులు అదుపులో ఉన్నాయని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. మూడు రోజుల నుంచి గ్రామంలోనే మకాం వేశాం. వైద్యశిబిరం ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాం. 19 తరువాత ఒక్క కేసూ నమోదుకాలేదు. గ్రామంలో వాంతులు, విరేచనాలతో ఐదుగురు చనిపోయారన్న వందతులతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. 14న వాంతులు, విరేచనాలతో ప్రైవేటు ఆసుపత్రి చేరిన మహంతేశ్ కోలుకున్నాడు. రెండు రోజుల తరువాత మరోసారి అస్వస్థతకు గురై చనిపోయాడు.

భక్తిశ్రద్ధలతో వసుధేంద్ర తీర్థ మధ్యారాధన


అలంకరణలో వసుధేంద్ర తీర్థ మూల బృందావనం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: వసుధేంద్ర తీర్థ మధ్యారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కెంచన గుడ్డ పరిధిలో తుంగభద్ర తీరాన ఉన్న శ్రీ వసుధేంద్ర తీర్థ 262 ఆరాధన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామి పాల్గొని మూల విరాట్‌కు నవగ్రహ పూజలు నిర్వహించారు. మధ్యారాధన పురస్కరించుకుని ఉదయాన్నే వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితులతో ప్రవచన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆరాధన ఉత్సవంలో పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న మంత్రాలయ పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామి

బెయిల్ పిటిషన్ల విచారణ వాయిదా

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి (33) హత్య కేసులో తమకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ నిందితులు పవన్, నందీశ్, రాఘవేంద్ర వేసుకున్న అర్జీ విచారణలు వాయిదా పడ్డాయి. రాఘవేంద్ర అర్జీని అక్టోబరు 25కు, మిగిలిన ఇద్దరి విచారణను 28కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఆదేశించారు.

శాంతించని తుంగభద్ర


తుంగభద్ర 21 గేట్లగుండా దిగువకు వెళ్తున్న తుంగభద్ర జలాలు


తుంగభద్ర ఆనకట్ట ఎదురుగా ఉన్న ఓ వంతెనను తాకుతూ పరుగులిడుతున్న నదీ జలాలు

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్రకు వస్తున్న వరద ప్రమాణం కొంత తగ్గినా సరాసరి లక్ష క్యూసెక్కులకు చేరుకుంది. ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ, ఆగుంబె, తీర్థహళ్లి ప్రాంతాల్లో వర్షాలు తగ్గాయి. అయినప్పటికీ వస్తున్న వరద తగ్గముఖం పట్టలేదు. బుధవారం సాయంత్రం జలాశయానికి 105000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 33 గేట్లలో 21 గేట్లను పైకెత్తి అంతే ప్రమాణంలో నీటిని నదికి విడుదల చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో వరద ప్రమాణం తగ్గే అవకాశం ఉందని ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 1631.92 అడుగుల నీటినిల్వ ఉంది. పెద్ద ఎత్తున నీటిని బయటకు విడుదల చేయడంతో జలాలు ఆనకట్ట ఎదురుగా మునిరాబాద్ మార్గంలో ఉన్న ఓ వంతెనను తాకుతూ పారుతున్నాయి.


సంధ్యాసమయంలో తుంగభద్ర అందాలు


కంప్లి కోటె వంతెనపై నడుచుకుంటూ వెళ్తున్న ప్రజలు

పాదచారులకు అనుమతి

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి కోటె వంతెన వద్ద తుంగభద్రమ్మ నిండుగా ప్రవహిస్తోంది. వంతెనకు ఆనుకుని నదీ ప్రవాహం ఉండడంతో వాహన రాకపోకలను నియంత్రించారు. పాదచారులను అనుమతించడంతో వంతెనకు ఇరువైపులా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కంప్లి నుంచి ప్రజలు వాహనాల్లో వంతెన వద్దకు వెళ్లి నడుచుకుంటూ వంతెన దాటి వాహనాల్లో గంగావతి వైపు వెళ్తున్నారు.

బెంగళూరు
•బెంగళూరు •హోసూరు

కేంద్ర మంత్రికి పలువురి శుభాకాంక్షలు


కేంద్రమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న అంజనప్ప, రమేష్ తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే పుట్టినరోజు సందర్భంగా యశ్వంతపుర విధానసభ క్షేత్రం కెంగేరి భాజపా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మల్లేశ్వరం సువర్ణభవనంలోని కార్యాలయంలో ఆమెకు క్షేత్రం భాజపా నగర మండలాధ్యక్షుడు అనిల్‌శెట్టి, కెంగేరి పురసభ మాజీ అధ్యక్షుడు అంజనప్ప, రమేష్, కదరప్ప, తదితరులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

అన్నమయ్య సంకీర్తన భరతనాట్య ప్రదర్శన

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : నటనం నృత్య సంస్థ ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తన సభ పేరిట ఈనెల 26న నయన సభాప్రాంగణంలో భరతనాట్య ప్రదర్శన నిర్వహిస్తోంది. ఆచార్య రక్ష శిష్య బృందంచే సాయంత్రం ఐదు గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. మేలుకోటె యతిరాజ మఠం రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆచార్య సదగోపన్, గౌరవ అతిథిగా మాజీ లోక్‌సభ సభ్యుడు కె.సి.రామమూర్తి పాల్గొననున్నారు.

కళాకారిణి రక్షా →



హోసూరు కబుర్లు

మాదక్కల్‌లో పర్యటించిన ఎమ్మెల్యే, కలెక్టర్

హోసూరు, న్యూస్‌టుడే : అంచెట్టి సమీపం మాదక్కల్ గ్రామంలో బుధవారం తళి ఎమ్మెల్యే టి.రామచంద్రన్, కలెక్టర్ సరయు పర్యటించారు. మహిళలకు ఇంటి పట్టాలు, రైతులకు రాయితీ ధరకు వ్యవసాయ ఉపకరణాలను కలెక్టర్ పంపిణీ చేశారు. నలుగురు గర్భిణీలకు పౌష్టికాహార పెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకం కింద బాలికల విద్యకు నెలకు రూ.1000 అందిస్తూ సాయపడుతున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు కుట్టుమిషన్లు, ఇస్త్రీ పెట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోసూరు సబ్‌కలెక్టర్ ప్రియాంక, అధికారులు పన్నీరుశెల్వం, రమేష్‌కుమార్, పద్మలత, జయంతి, మాదేష్, శ్రీనివాసమూర్తి, పంచాయతీ అధ్యక్షురాలు మల్లమ్మ, పంచాయతీ సభ్యులు పళనిస్వామి, యూనియన్ కౌన్సిలర్ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.


రైతులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సరయు, తదితరులు

ఔత్సాహికులకు ఉపాధి శిక్షణ

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధి అర్హత మహిళ్లే స్వయం ఉపాధి పొందడానికి ఆసక్తి కలిగిన ఔత్సాహికులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. కృష్ణగిరి, ధర్మపురి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు డాక్టర్ మహేంద్రవర్మ పరిశ్రమలు స్థాపనకు ప్రభుత్వం నుంచి అనుమతి, రుణాలు, సమస్యలపై వివరించారు. టైటాన్ సంస్థ వ్యవస్థాపకుల ఎస్.సుందరదివేలు, యూనియన్ ఛైర్‌పర్సన్ శశి వెంకటస్వామి, ప్రముఖులు ప్రభాకర్, కెంపన్న, రాజప్ప, కుమరేశన్, చంద్రన్, ముత్తుకుమారస్వామి, ఉత్తమర్, జ్ఞానేశన్ కరుప్పయ్య, శివశంకర్, అంబానీ సరోజ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మహేంద్రవర్మ తదితరులు

కావేరినది జాగృతి యాత్రలో హోసూరు సురేష్

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధి న్యూ ఎ.ఎస్.టి.సి. కాలనీకి చెందిన సురేష్ కావేరినది జాగృతి యాత్రలో పాల్గొన్నారు. యాత్ర కొడగు నుంచి వివిధ జిల్లాల ద్వారా తమిళనాడులో ప్రవేశిస్తుంది. నవంబరు 19న తమిళనాడులోని సముద్ర తీరానికి చేరుకుంటుంది. యాత్రకు అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. కావేరి నది స్వచ్ఛతను సంరక్షించాలని, నీటి స్థావరాలను రక్షించాలని కోరుతూ యాత్రలో ప్రచారం చేసి చైతన్యం తెస్తున్నారు. యాత్రను కావేరినది సంరక్షణ కమిటీ, కావేరినది సేవా ట్రస్టు నిర్వహిస్తున్నారు. పలువురు సాధువులు యాత్ర వెంట ఉన్నారు.


జాగృతి యాత్రలో సురేష్, తదితరులు


నివాళులర్పిస్తున్న మంత్రి శివరాజ్ తంగడగి


బెళగావిలో ఉత్సవాల వేళ సాంస్కృతిక బృందాల సంబరం


ప్రారంభిస్తున్న మంత్రులు సతీశ్ జార్కిహోళి, లక్ష్మీ హెబ్బాళ్కర్

కిత్తూరు రాణి ధైర్య సాహసాలు ఆదర్శం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : కిత్తూరు రాణి చెన్నమ్మ చారిత్రాత్మక 200వ విజయోత్సవాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రి శివరాజ్ తంగడగి బుధవారం అధికారికంగా ప్రారంభించారు. రవీంద్ర కళాక్షేత్ర సమీపంలోని కిత్తూరు రాణి చెన్నమ్మ విగ్రహం వద్ద ఉంచిన చిత్రపటానికి సీఎం పుష్పార్చన చేశారు. ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రం మొత్తం సంచరించి వచ్చిన కిత్తూరు వీరజ్యోతిని బెళగావి చెన్నమ్మ సర్కిల్‌లో మంత్రి సతీశ్ జార్కిహోళి బుధవారం అందుకున్నారు. జానపద కళా ఉత్సవాన్ని మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ప్రారంభించారు. చిట్టిమేళ, మహిళా వీరగాసె, ఉత్తర వేష, గారుడి గొంబె, మీను నృత్య, మహిళా డొల్లుకుణిత, కంసాళె, కుదురె కుణిత, నంది ధ్వజ, కరడి మజలు, జగ్గలగి తదితర కళా ప్రదర్శనలు స్థానికులను అడ్డుకున్నాయి. జిల్లాధికారి మహ్మద్ రోషన్, ఎస్పీ భీమాశంకర్ గుళేద్, జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శింధె, ఎమ్మెల్యేలు బాబాసాహెబ్ పాటిల్, మహంతేశ కౌజలగి, ఆసిఫ్ సేఠ్, చెన్నరాజ హట్టిహోళి, వివిధ మఠాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివారం వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.


కిత్తూరు రాణి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి

చిత్రదుర్గం : ఆంగ్లేయ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన కిత్తూరు రాణి చెన్నమ్మ ధైర్య సాహసాలు నేటి మహిళలకు ఆదర్శప్రాయమని అదనపు జిల్లా పాలనాధికారి కుమారస్వామి తెలిపారు. బుధవారం ఇక్కడ కార్యాలయంలో రాణి చెన్నమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళులు అర్పించి మాట్లాడారు. రాణి చెన్నమ్మ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. ఆమె చూపిన ధైర్య సాహసాలు నేటి యువతులకు స్ఫూర్తి కలగాలన్నారు. చెన్నమ్మ జీవన చరిత్రను అధ్యాపకురాలు మమత వివరించారు. రంగస్థల దర్శకుడు గణేశయ్య, వీరశైవ సమాజం జిల్లా కార్యదర్శి వీరేంద్ర కుమార్, కొట్రేశప్ప, చిదానందప్ప, ఉమా, శైలా పాల్గొన్నారు.


చిత్రపటానికి పుష్పార్చన చేస్తున్న అదనపు పాలనాధికారి కుమారస్వామి తదితరులు

పార్టీల్లో కుటుంబ రాజకీయాలు

కోలారు, న్యూస్‌టుడే: కుటుంబ, వారసత్వ రాజకీయాలు అన్ని పార్టీల్లో ఉన్నాయని ఎంపీ డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. చెన్నపట్టణలో కుమారస్వామి కుటుంబ సభ్యుల పోటీకి సంబంధించి విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ నేతలు నెహ్రూ, ఇందిర, రాజీవ్, రాహుల్, ప్రియాంక, సోనియా ఎన్నికల్లో పోటీకి సంబంధించి ఎందుకు నోరు మెదపరని ప్రశ్నించారు. సీపీ యోగేశ్వర్ గత ఎన్నికల్లో ఓడిపోయినా, ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని, ఇప్పుడు కాంగ్రెస్‌కు వెళ్లి తప్పు చేశారని వ్యాఖ్యానించారు.

తైక్వాండోలో బంగారు పతకాలు

జాలహళ్లి, న్యూస్‌టుడే : బెంగళూరు విశ్వవిద్యాలయంలో జరిగిన తైక్వాండో పోటీల్లో మత్తికెరె జె.పి.పార్కు తైక్వాండో క్రీడాకారులు ప్రభాస్‌రెడ్డి, ఆర్.ఎస్.దీలిప్, ఎన్.హరితా, సచిన్ బంగారు పతకాలు సాధించినట్లు శిక్షకుడు సి.పి.పెంచలయ్య తెలిపారు. ఆల్ ఇండియా యూనివర్శిటీ స్పోర్ట్స్ మీట్‌లో ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులు బంగారు పతకాలను సాధించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు.



పతక విజేతలతో పెంచలయ్య

ఆకట్టుకొంటున్న ఇండియా మేళా

బెంగళూరు (జాలహళ్లి) న్యూస్‌టుడే : నగరంలోని హెచ్.ఎం.టి క్రీడామైదానంలో బెస్ట్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన మేళాలో దేవతల ప్రతిమలు సందర్శకులను ఆకట్టుకొంటున్నాయి. వస్తు సామాగ్రి వినియోగదారులకు 70 శాతం రాయితీతో అందుబాటులో ఉన్నాయి. దళారుల వ్యవస్థ లేకుండా నేరుగా నిర్వాహకులు విక్రయిస్తున్నారు. పట్టుచీరలు, చుడీదార్, పంజాబీ డ్రస్సులు, ఆంధ్ర పచ్చలు, వెంకటగిరి చీరలు, సోఫాలు, వివిధ దేవతల ప్రతిమలు మేళాలో అందుబాటులో ఉంచారు.


వినాయక ప్రతిమ

యలహంకకు ఉప లోకాయుక్త

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : యలహంక ఉపనగర ఎన్‌ఈఎస్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ భవన్‌కు ఉప లోకాయుక్త జస్టిస్ కేఎన్ ఫణీంద్ర రానున్నారు. గురు, శుక్రవారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు అధికారులతో కలిసి ప్రజల సమస్యలు ఆలకించి, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. స్థానికులు తమ ఫిర్యాదులను ఉపలోకాయుక్తకు అందించవచ్చని జిల్లాధికారి జగదీశ్ ప్రజలను కోరారు.

'దళ్‌తో కలిసి పనిచేస్తాం'

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఎవరనేది జనతాదళ్ నేతలు తీర్మానిస్తారని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఎవరిని నిలిపినా, అభ్యర్థి గెలుపుకు దళ్‌తో పాటు భాజపా కార్యకర్తలు శ్రమిస్తారని తెలిపారు. యోగేశ్వర్ పార్టీ వీడడంతో తమకు తీరని నష్టం ఏమీ లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరి తాను తప్పు చేశానని ఆయన పశ్చాత్తాపానికి గురయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు.

జాగృతికి ముందుకొచ్చిన ధోనీ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : 'చికిత్స అత్యవసరం' అంటూ రోగులకు కృత్రిమ మేధస్సుతో అవగాహన వీడియోలను అందిస్తున్న మెరిల్ సంస్థ తరపున ప్రచారం చేసేందుకు ప్రముఖ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ ముందుకు వచ్చారు. రోగం బారిన పడకముందే వైద్య పరీక్షలు చేయించుకోవలసిన అవసరం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వివిధ చికిత్సలపై ఉండే అపోహలను తొలగించడం, ఆరోగ్య సముదాయాలు, ఆసుపత్రులు, వైద్య నిపుణుల వివరాలను తెలియజేసే వీడియోలతో వేర్వేరు వేదికలపై ఎంఎస్ ధోనీ ప్రచారాన్ని నిర్వహిస్తారని సంస్థ సీఎంఓ మనీశ్ దేశ్‌ముఖ్ తెలిపారు. బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిన అవసరంపై జాగృతి కల్పించే లక్ష్యానికి మద్దతు ఇచ్చేందుకు ధోనీ ముందుకు వచ్చారని చెప్పారు.


ఎంఎస్ ధోనీ

పేలిన సిలిండర్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ఎలక్ట్రానిక్ సిటీ పరిధి బెట్టదాసపురలో గ్యాస్ ఫిల్లింగ్ సెంటర్‌లో బుధవారం సాయంత్రం సిలిండర్ పేలడంతో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. జహీర్ అనే వ్యక్తికి చెందిన దుకాణంలో పేలుడుకు షట్టరు గేటు విరిగి పడింది. లోపల ఉన్న వస్తువులు అన్నీ చెల్లాచెదురయ్యాయి. అగ్నిమాపకదళ సిబ్బంది మంటల్ని అదుపు చేశారు. బాధితులను చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ఎలక్ట్రానిక్ సిటీ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కంజన్‌పై దాడి చేసిన ధనుంజయ

మడికేరి, న్యూస్‌టుడే : దసరా ఏనుగులు కంజన్, ధనుంజయ మధ్య గొడవ ఇంకా చల్లారలేదు. దసరా సమయంలో ప్యాలెస్ మైదానంలో ఒకదానితో మరొకటి తలపడ్డాయి. ఇప్పుడు దుబారె శిబిరంలో ఈ రెండూ గొడవ పడుతున్నాయని మావటీలు చెప్పారు. కుశాలనగర సమీపంలోని దుబారె శిబిరం నుంచి ఒక ఏనుగును మరో చోటుకు మార్చాలని అధికారులు యోచిస్తున్నారు.


వాకర్‌పై ఉదయ్ గరుడాచార్, రామలింగారెడ్డి

జయనగర్‌లో వ్యాయామశాల ప్రారంభం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. జయనగర సౌత్ ఎండ్ కూడలి వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన పాలికె వ్యాయామశాలను ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్‌తో కలిసి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యాయామశాలల్లో సేవలు అందుకునేలా అన్ని వార్డుల్లో దశల వారీగా జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాయామ పరికరాలను మంత్రి, ఎమ్మెల్యే, స్థానిక కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్‌లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

డైరెక్టర్‌గా జయలక్ష్మి ఏకగ్రీవం

పావగడ, న్యూస్‌టుడే : మహిళ, శిశు సంక్షేమశాఖ అభివృద్ధిశాఖ నౌకర సంఘం తాలూకా డైరెక్టర్‌గా సీడీపీవో కార్యాలయం సూపర్‌వైజర్ ఎ.జయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ శాఖ నుంచి జయలక్ష్మి ఒకరే నామినేషన్ పత్రాన్ని సమర్పించడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రామక్రిష్ణప్ప తెలిపారు. జయలక్ష్మికి పలువురు అధికారులు, వాల్మీకి సముదాయ నాయకులు అభినందనలు తెలిపారు. తాలూకాలో 14 శాఖల్లోని 34 డైరెక్టర్ల స్థానాలకు 28వ తేది ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే పలు శాఖల్లో 23 మంది డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


జయలక్ష్మి

చెరువులు, కుంటల వద్ద జాగ్రత్త

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువులు, కుంటలు, కాలువల వద్దకు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు జిల్లాధికారి పీఎన్ రవీంద్ర సూచనలు చేశారు. కొద్దిపాటి నిర్లక్ష్యంతో పెను ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు. ఇప్పటికే కురిసిన వర్షాలతో పంటనష్టం జరిగిన ప్రాంతాలకు వెళ్లి వివరాలు సేకరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. గత వారం చిక్కబళ్లాపుర నగరంలో 87 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. సాధారణంగా ఈ అవధిలో 25 మి.మీ. వర్షం కురుస్తుందని గుర్తు చేశారు. జక్కలమడుగు, అమాని భైరసాగర, చిత్రావతి జలాశయం తదితరాలు నీటితో నిండాయని తెలిపారు. వర్షంతో దెబ్బతిన్న ఇంటి యజమానులకు పరిహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సూచనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాధికారి

38 కేంద్రాలు..14,253 మంది అభ్యర్థులు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ పరిపాలనాధికారుల పోటీ పరీక్షలను ఈ నెల 26, 27 తేదీల్లో జిల్లాలో 38 కేంద్రాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని, పరీక్షలకు 14,253 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు జిల్లా పాలనాధికారి వెంకటేశ్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం జరిగింది. కేఈఏ నియమ నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, బాధ్యతయుంగా జరిగేలా చూడాలన్నారు. చరవాణులు, ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రాల్లోకి అనుమతించరాదన్నారు. సమావేశంలో అదనపు జిల్లా పాలనాధికారి కుమారస్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి మంజునాథ్, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి రేణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి వెంకటేశ్


రామలింగ, శ్రీనివాసప్రసాద్, మహమ్మద్ రియాజ్ ఉల్లా, రామాంజినప్ప, గంగాధర

పురసభకు ఐదుగురు సభ్యుల నియామకం

పావగడ, న్యూస్‌టుడే : పావగడ పట్టణ పురసభకు ఐదుగురు నామినేటెడ్ కౌన్సిలర్లను ఎంపిక చేసినట్లు ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీచేసింది. 6వ వార్డు పి.ఎన్.రామలింగ, 17వ వార్డు శ్రీనివాసప్రసాద్, 5వ వార్డు మహమ్మద్‌రియాజ్ ఉల్లా, 16వ వార్డు రామాంజినప్ప, 2వ వార్డు ఎస్.ఎ.గంగాధర ఎంపికయ్యారు. నామినేటెడ్ కౌన్సిలర్లకు ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్, పురసభ అధ్యక్షుడు పి.హెచ్.రాజేష్, కాంగ్రెస్ నాయకులు, పట్టణ కౌన్సిలర్లు అభినందనలు తెలిపారు.

క్రీడాభివృద్ధికి బ్రిటిష్ కౌన్సిల్‌తో ఒప్పందం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : బ్రిటిష్ కౌన్సిల్‌తో దేహదారుఢ్య పటిష్టం చేసేందుకు ఒప్పందాలు చేసుకున్నట్టు ప్రాథమిక విద్యా శాఖ మంత్రి మధుబంగారప్ప తెలిపారు. బుధవారం నగరంలో కర్ణాటక ప్రభుత్వ పాఠశాల-బ్రిటిష్ ఫుట్‌బాల్ కౌన్సిల్ మధ్య క్రీడా సంబంధ ఒప్పందాలు జరిగాయి. దక్షిణభారత బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, డిప్యూటి హైకమిషన్ ముఖ్యుడు జేమ్స్‌గాడ్బర్, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి రితేష్‌కుమార్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఒప్పందాలతో కర్ణాటక పాఠశాల వ్యవస్థలో దైహికశిక్షణకు ప్రాధాన్యం లభించనుందన్నారు. ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో జీవన కౌశల్యాన్ని పెంపొందించేందుకు ఈ ఒప్పందాలు ఉపయోగమన్నారు. ప్రాథమిక పాఠశాల అధ్యాపకులు, శిక్షకులను ప్రోత్సహించడానికి ప్రాధాన్యం ఇస్తామని మంత్రి మధుబంగారప్ప వివరించారు.


ఒప్పంద ప్రక్రియలో మధుబంగారప్ప, జనకపుష్పనాథన్ తదితరులు

మేళాను సద్వినియోగం చేసుకోవాలి

తుమకూరు, న్యూస్‌టుడే : నగరంలోని చిలుమె పోలీస్ సముదాయ భవనంలో 10 రోజుల పాటు కొనసాగే మైసూర్ శ్యాండిల్ సబ్బుల మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్ధగంగామఠం అధ్యక్షుడు సిద్ధలింగస్వామీజీ పిలుపునిచ్చారు. సబ్బుల మేళాను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 108 ఏళ్లుగా నాణ్యమైన ఉత్పత్తులతో సంస్థ ప్రజాదరణ పొందిందన్నారు. ముఖ్యమంత్రి నుంచి రెండుసార్లు రత్న ప్రశస్తి లభించడంపై స్వామీజీ అభినందించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ గత సంవత్సరం రూ.1570 కోట్ల లావాదేవీలు జరిగాయని, రూ.362 కోట్లు లాభాలు గడించినట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అమ్మకాల్లో రాష్ట్రంలోనే ఉత్తమ ప్రగతిలో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎడిటర్ ఎస్.నాగణ్ణ, హోం మంత్రి ప్రత్యేక కర్తవ్యాధికారి నాగణ్ణ, జనరల్ మేనేజర్ గంగప్ప, అసిస్టెంట్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సిద్ధలింగస్వామీజీ, తదితరులు

గుర్తింపు కార్డుల కోసం పోటెత్తిన ప్రతినిధులు

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు మిల్క్ యూనియన్ డైరెక్టర్ల స్థానాలకు వచ్చే నవంబరు 10న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంతో ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఓట్ల గుర్తింపు కార్డుల కోసం తహసీల్దార్ కార్యాలయం ముందు ఓటర్లు గుమిగూడారు. జిల్లా వ్యాప్తంగా ఉండే మిల్క్ యూనియన్ సంఘాల ప్రతినిధులు ఎన్నికల అధికారి తహసీల్దార్ కార్యాలయం ముందు జనం కిక్కిరిసిపోయారు. 10 తాలూకాల నుంచి 10మంది డైరెక్టర్లను ఆయా మిల్క్ యూనియన్లలోని సభ్యులు ఎంపిక చేసుకోవాల్సి ఉంది. ఇప్పటికే వివిధ పార్టీల ప్రతినిధులు తమ అభ్యర్థుల ఎంపికకు కసరత్తులు చేయడంతో పాటు మిల్క్ యూనియన్ల సభ్యులను కలిసి తమకే ఓటువేయాలని అభ్యర్థిస్తున్నారు.


తహసీల్దార్ కార్యాలయం ముందు గుమిగూడిన ప్రజలు

సవితా సమాజం సేవలు మంగళకరం

బెంగళూరు (శివాజీనగర): సవితా సముదాయం (క్షురకులు) అందిస్తున్న సేవలు మంగళకరమని శృంగేరి శారదామఠం పీఠాధిపతి విదుర శేఖర భారతీస్వామి పేర్కొన్నారు. నవరాత్రి సమయంలో సవితా సమాజానికి చెందిన కళాకారులు ఒక రోజు సంగీత సేవలు అందించేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. చాతుర్మాసాన్ని పురస్కరించుకుని చామరాజపేటలోని మఠంలో సవితా సముదాయం సంఘాలు, సమాఖ్యల ప్రతినిధులు, సభ్యులను స్వామీజీ ఆశీర్వదించారు. కేఆర్ నగర యడతొరె యోగానందేశ్వర సరస్వతి మఠానికి చెందిన శంకర భారతి స్వామితో కలిసి ఆయన మాట్లాడారు. మనచుట్టూ ఉన్న అన్ని సముదాయాల ప్రతినిధులను సమానంగా చూసినప్పుడు మాత్రమే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సవితా అభివృద్ధి మండలి మాజీ అధ్యక్షుడు ఎస్ నరేశ్ కుమార్, సముదాయం నాయకులు కిరణ్ సంపత్ కుమార్, ఏసీపీ నారాయణ స్వామి, న్యాయవాది నరసింహరాజు, ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ తదితరులు మఠాధిపతులతో ఆశీస్సులు అందుకున్నారు.


మఠాధిపతితో సంఘం ప్రతినిధులు

మృతుల వివరాలను వెల్లడించిన పోలీసులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బాబూసాపాళ్యలో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవంతి ఉన్నపళంగా మంగళవారం సాయంత్రం కూలిపోవడంతో శిథిలాల కింద చిక్కుకుని మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి చేరింది. మంగళవారం రాత్రి అర్మాన్ (26) అనే బిహారుకు చెందిన కార్మికుడి మృతదేహాన్ని వెలికి తీశారు. బుధవారం మధ్యాహ్నం వరకు మహ్మద్ సాహిల్ (19), మణికంఠన్ (26), సత్యరాజ్ (25), శ్రీరాన్ త్రిపాల్ (35), సోలో పాశ్వాన్, శంకర్, చిత్తూరు జిల్లాకు చెందిన తులసిరెడ్డిని మృతులుగా గుర్తించారు. ఇంటి యజమాని కుమారుడు భువన్, ఇన్‌ఛార్జులు మోహన్‌రెడ్డి, ఏళుమలైలను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఇంటి యజమాని, మేస్త్రీ కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. నాలుగు అంతస్తులను నిర్మించేందుకు అనుమతి ఇవ్వగా, ఆరు అంతస్తులను కడుతున్నా పట్టించుకోలేదన్న ఆరోపణలపై అధికారి కె.వినయ్‌ను సస్పెండ్ చేస్తూ పాలికె కమిషనర్ తుషార్ గిరినాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఘటన జరిగిన ప్రాంతానికి లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్ వెళ్లి పరిస్థితులను సమీక్షించారు. అనుమతి ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు.

అస్వస్థతకు గురైన చెన్నమ్మ

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : మాజీ ప్రధాని దేవేగౌడ భార్య చెన్నమ్మ (85)బుధవారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది ఎదుర్కొంటున్న ఆమెను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆమె అస్వస్థతకు గురయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యా సంస్థలకు ఆర్థిక తోడ్పాటు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల వృద్ధి, విద్యాబోధనలో మార్పులు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నామని ఆక్సిలో ఫిన్‌సర్వ్ ప్రకటించింది. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రుణాన్ని మంజూరు చేస్తామని సంస్థ సీఈఓ నీరజ్ సక్సేనా తెలిపారు. నూతన విద్యావిధానం అనుసరిస్తున్న విద్యాసంస్థల్లో మౌలిక, డిజిటల్ సదుపాయాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, పారిశుద్ధ్యం, క్రీడా సదుపాయాలను కల్పించేందుకు ఈ రుణాలను మంజూరు చేస్తున్నామని వివరించారు.

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు

విమానాశ్రయ నిర్మాణానికి స్థలం కేటాయింపు

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు సమీపంలో విమానాశ్రయం నిర్మాణానికి విమానయాన మంత్రిత్వశాఖ సైట్ క్లియరెన్స్‌కు ఆమోదించింది. ఈ విషయాన్ని డైరెక్టర్ జయంత చక్రబర్తి కేఎస్ఐఐడీసీ (కర్ణాటక స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ఎండీకి రాత పూర్వకంగా తెలియజేశారు. 2022 జూన్ 7న కర్ణాటక ప్రభుత్వం రాయచూరులో డొమెస్టిక్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ప్రతిపాదనలు పంపింది. దీని ఆధారంగానే పరిష్కరించారు. నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ నివేదికను పంపాలని, ప్రిన్సిపల్ గ్రాంటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థల సమస్య తీరడంతో పనుల ప్రారంభానికి అడ్డంకులు తొలగిపోయాయి.

ఉపకులపతికి రేపు సన్మానం


హరీష్ రామస్వామి

రాయచూరు, న్యూస్‌టుడే: పదవీ విరమణ చేయబోతున్న రాయచూరు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య హరీష్ రామస్వామికి ఈ నెల 25న సన్మానం, అభినందన సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తారనాథ్ విద్యా సంస్థల అధ్యక్షుడు పార్మల్ సుఖాని ఒక ప్రకటనలో వెల్లడించారు. స్థానిక ఎల్‌వీడీ కళాశాల ప్రేక్షక ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని వివరించారు. సన్మానంలో ఆయా కళాశాలల ముఖ్యులు, ఉపన్యాసకులు భాగస్వామం కావాలని కోరుతున్నారు. హరీష్ రాయచూరు విశ్వవిద్యాలయం తొలి ఉప కులపతి.


నినాదాలు చేస్తున్న నాయకులు

బస్సులు లేక విద్యార్థుల కష్టాలు

రాయచూరు, న్యూస్‌టుడే : తవగ, కర్జిగి, చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులు హట్టి, లింగసూగూరుకు రాకపోకలు సాగించేందుకు అదనపు బస్సులు నడపాలంటూ 'ఎస్ఎఫ్ఐ' హట్టి ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రమేష్ వీరాపూర మాట్లాడుతూ విద్యాలయాలకు వెళ్లేందుకు సరైన సమయంలో బస్సులు రాక తరగతులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో బస్సులను తిప్పాలని అనేసార్లు విన్నవించినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయం ఉన్నా సరే ఎందుకు నడపటం లేదో అర్థం కావడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. ఉదాసీనంగా వ్యవహరిస్తే డిపో వద్ద నిరవధిక ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం హట్టి కంట్రోలర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తమ్మణ్ణ, అమరేశ్, అభిషేక్, మహదేవ, సంగమేష్, బసవరాజ్, నింగప్ప పాల్గొన్నారు.

శిథిలాల కింద మరణమృదంగం

భవంతి కూలిన ఘటనలో ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య


పూర్తిగా శిథిలమైన ఆరంతస్తుల భవంతి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : కన్నడిగుల రాజధాని నగరి బెంగళూరులోని బాబూసాబ్‌పాళ్యలో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవంతి మంగళవారం సాయంత్రం కూలిపోయిన ఘటనలో.. శిథిలాల కింద చిక్కుకుని మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. మంగళవారం రాత్రి అర్మాన్ (26) అనే బిహారీయుడు చెందిన కార్మికుని మృతదేహాన్ని వెలికి తీశారు. బుధవారం మధ్యాహ్నం వరకు మహ్మద్ సాహిల్ (19), త్రిపాల్ (35), శంకర్ (26), సత్యరాజ్ (25)ను వెలికి తీయగా.. మరో ముగ్గురి వివరాలను గుర్తించవలసి ఉందని హెణ్ణూరు ఠాణా పోలీసులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకుని గాయపడిన జగదేవ్ (45), రషీద్ (28), నాగరాజ్ (25), రమేష్ కుమార్ (28)లను చికిత్స కోసం బెంగళూరు సౌత్ ఆసుపత్రిలో చేర్పించారు. హర్మాన్, ఆయాజ్ అనే కార్మికులను వరుసగా హోస్మార్, ఆస్టర్ ఆసుపత్రుల్లో చేర్చారు. విపత్తు నిర్వహణ దళం, అగ్నిమాపకదళ సిబ్బంది సెన్సార్, శ్వానదళం (డాగ్‌స్క్వాడ్) సహకారంతో గాలింపు చేపట్టారు. మరో ఏడుగురు కార్మికులను మంగళవారం సాయంత్రమే సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.


శిథిలాలను తొలగిస్తున్న యంత్రం

ఇద్దరి అరెస్టు..

భవంతి కూలిన ఘటనలో దాని యజమాని, మల్లేశ్వరంలో ఉంటున్న ప్రవాసాంధ్రుడు భువన్‌రెడ్డి, గుత్తేదారు మునియప్పను హెణ్ణూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఘటన జరిగిన వెంటనే ఇద్దరూ పరారయ్యారు. పరారీలో ఉన్న భవనం యజమాని కుమారుడు మోహన్‌రెడ్డి, మేస్త్రీ కోసం పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. ఎనిమిది నెలల నుంచి ఈ భవంతి నిర్మాణం కొనసాగుతోంది. సెల్లార్‌తో పాటు నాలుగు అంతస్తులను నిర్మించేందుకు అనుమతి తీసుకుని ఆరు అంతస్తులను నిర్మిస్తున్నారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. నాసిరకం సిమెంటు, ఇతర భవన నిర్మాణ సామగ్రిని వినియోగించడంతోనే పునాదుల నుంచే భవంతి విరిగి పక్కకు పడింది. పునాది కోసం తీసిన గుంతల్లో మట్టి వదులుగా మారడంతోనూ అది ఒకేసారి పక్కకు ఒరిగి పడిపోయిందని గుర్తించారు. ప్రమాదం సంభవించిన సమయంలో 21 మంది కార్మికులు అక్కడ పని చేస్తున్నారు. మరో కార్మికుడు శిథిలాల కింద ఉండి ఉంటాడని అనుమానిస్తున్నామని అగ్నిమాపక దళ అధికారులు వివరించారు.


బాబూసాపాళ్యలో భవంతి శిథిలాల నుంచి కార్మికులను వెలికి తీసేందుకు చేపట్టిన కార్యాచరణ


కార్మికుని మృతదేహాన్ని తీసుకువస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ దళం

రామాంజనేయుడికి మహా పూజలు


భారీ విగ్రహం వద్ద విశ్వేశ ప్రసన్నతీర్థ స్వామి, యడియూరప్ప తదితరులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాజాజీనగర రామమందిరం ఆవరణలో 63 అడుగుల ఎత్తైన శ్రీరామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ప్రక్రియ బుధవారంతో పూర్తయింది. విశ్వేశ ప్రసన్న తీర్థ స్వామి, ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామి, సౌమ్యనాథస్వామి పూజా క్రతువులను కొనసాగించారు. నగరానికి వచ్చే భక్తులకు ఇది తీర్థ ప్రదేశం అవుతుందని నిర్మలానందనాథ స్వామి ఆశీర్వదించారు. శ్రీరాముని ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, మల్లేశ్వరం ఎమ్మెల్యే డాక్టర్ అశ్వత్థనారాయణ, శ్రీరామసేవా మండలి అధ్యక్షుడు శ్రీధర్, మండలి సభ్యులు ఆర్‌వీ హరీశ్, సావిత్రి సురేశ్ కుమార్, హెచ్‌ఎం కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్లు మోహన్ కుమార్, మంజునాథ్, దీపా నాగేశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెయిల్ పిటిషన్ల విచారణ వాయిదా

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి (33) హత్య కేసులో తమకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ నిందితులు పవన్, నందీశ్, రాఘవేంద్ర వేసుకున్న అర్జీ విచారణలు వాయిదా పడ్డాయి. రాఘవేంద్ర అర్జీని అక్టోబరు 25కు, మిగిలిన ఇద్దరి విచారణను 28కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఆదేశించారు.

అశాస్త్రీయ వర్గీకరణను రద్దు చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్యకర్తలు

సిరివార, (మాన్వి) : రిజర్వేషన్ల అమలుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కొన్ని సంఘాల ప్రముఖులు, నాయకులు చేస్తున్న డిమాండ్ అర్థరహితమని అఖిల కర్ణాటక బంజార సేవా సమితి ఆరోపించింది. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. ఎస్సీల్లోని 101 సముదాయాల ఆర్థిక, సామాజిక, శైక్షణిక ప్రాతినిధ్యంపై అధ్యయనం చేయకుండా కొందరి ప్రయోజనం కోసం వర్గీకరణ చేశారని, ఇది ఏక పక్ష నిర్ణయమని నిందించారు. అలెమారి, కొరమ, కొరవ, కొరచ, భోవి సముదాయాలకు మద్దతుగా బంజార సేవా సమితి పోరాడుతుందని తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు మౌనేశ్ పవార్, వెంకటేశ్ పవార్, అమరేశ్‌పవార్, శేఖరప్పపవార్, గంగప్ప రాథోడ్, శివప్ప రాథోడ్, రెడ్డప్ప, శేఖరప్ప కారబారి, పరమేశ్ రాథోడ్, శివకుమార్ చౌహాణ్ తదితరులు పాల్గొన్నారు.

'శిగ్గావ్‌లో తిరుగులేని భాజపా'

హావేరి, న్యూస్‌టుడే : శిగ్గావ్ నియోజకవర్గం ఉపఎన్నికల్లో భాజపాలో ఎటువంటి తిరుగుబాటు లేదని మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బసవరాజ బొమ్మై తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు, ఎంపీ ఎన్నికల అనంతరమూ భరత్ బొమ్మై నియోజకవర్గం ప్రజలకు చేరువగానే ఉన్నారని తెలిపారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి బరిలో ఎవరు నిలిచినా, భాజపాకు పోటీ రాదన్నారు. యోగేశ్వర్ కాంగ్రెస్ నుంచి పోటీ చేసినా, కుమారస్వామి, దళపతుల ప్రభావం ముందు ఎన్నికల్లో ఆయన ఓటమి పాలవుతారని జోస్యం చెప్పారు.

రాణి చెన్నమ్మ జీవితం స్ఫూర్తిదాయకం


నివాళులు అర్పిస్తున్న శశికాంత్ తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రంగమందిరంలో కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. జడ్పీ ఉప కార్యదర్శి శశికాంత్ శివపురే, రాయచూరు తహసీల్దార్ సురేష్‌వర్మ తదితరులు చెన్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ కూడలి నుంచి చిత్రపటంతో ఊరేగింపు ప్రారంభమైంది. స్టేషన్ రహదారి మీదుగా రంగమందిరాన్ని చేరుకుంది. ఈ సందర్భంగా శశికాంత్ మాట్లాడుతూ ఆంగ్లేయులు కిత్తూరు సంస్థానాన్ని స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నిస్తే వారిపై పోరాటం చేసి సంస్థానాన్ని కాపాడుకున్న సాహస వీర వనిత రాణి చెన్నమ్మ అని కొనియాడారు. భర్త లేకున్నా ఒంటరిగానే వీరోచిత పోరు సల్పిన ఆమె ధైర్యం, తెగువ చూసి తెల్ల దొరలు గడగడలాడారని తెలిపారు. స్వాతంత్ర్య సమరంలో కూడా పాలుపంచుకున్న యోధురాలు అని కీర్తించారు. ఆమె జీవితాన్ని మహిళలు స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలని ఆకాంక్షించారు. చెన్నమ్మ చరిత్రను ఉపాధ్యాయుడు దండప్ప బిరాదార్ ఉపన్యసించారు. ఏఎస్పీ హరీష్, ప్రముఖులు బాబురావు, దానమ్మ, ఈరమ్మ పాల్గొన్నారు.

మాన్వి: ప్రతి ఇంటా ఓ కిత్తూరు రాణి చెన్నమ్మ జన్మించాలని, అమ్మాయిలను చెన్నమ్మ మాదిరిగా తీర్చిదిద్దాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాన్వి, సిరివార, లింగసుగూరు తాలూకాల్లో తాలూకా అధికార యంత్రాంగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కిత్తూరు రాణి చెన్నమ్మ జయంత్యుత్సవాల్లో మాట్లాడారు. చెన్నమ్మ దేశ ప్రేమ, పోరాట పటిమ అనుసరణీయమన్నారు. ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నంగా నిలిచి వారిని గడగడలాడించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రాజు, రవి, రెవెన్యూ శాఖ అధికారులు, వీరశైవ సముదాయం ప్రముఖులు వై. భూపనగౌడ, అరుణ్ చెంద్రా, ఉదయకుమార్, శివశరణ అరికెరా, చుక్కి ఉమాపతి, శ్రీధర్‌స్వామి, హరిహరపాటిల్, జగదీశ్ ఒతూరు, వీరనగౌడ, శివలింగయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

సింధనూరు : బ్రిటిష్ రాజులను గడగడలాడించిన ధైర్యశాలి కిత్తూరు రాణి చెన్నమ్మ సాహసాలను వర్ణించ వీలుకాదు, ఆమె ఎందరో వీర వనితలకు ఆదర్శమని కొప్పళ మాజీ ఎంపీ కె.విరుపాక్షప్ప కొనియాడారు. బుధవారం చెన్నమ్మ జయంతి సందర్భంగా స్థానిక తంతితపాల శాఖ కార్యాలయం కూడలిలో ఆమె విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. మాజీ మంత్రి నాడగౌడ, యువ నాయకులు రాజుగౌడ బాదర్లి, ఎం.దొడ్డబసవరాజ్, బసవరాజ్ నాడగౌడ పాల్గొన్నారు.


మాన్వి తహసీల్దార్ కార్యాలయంలో కిత్తూరు చెన్నమ్మ జయంతి


సిరివారలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజలు


సింధనూరులో రాణి చెన్నమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆటలతో శారీరక ఉత్తేజం

రాయచూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువులకే పరిమితం కావొద్దని, ఆటల పోటీల్లో చురుగ్గా పాల్గొనాలని రాయచూరు విశ్వవిద్యాలయం కళా విభాగం డీన్ ఆచార్య సి.ఎస్.పార్వతి సూచించారు. శారీరక ఉత్తేజం, దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని కల్గించే ఆటలు ఎక్కడ జరిగినా వెళ్లాలని కోరారు. ఈ నెల 30 నుంచి నవంబరు 4 వరకు చెన్నైలో దక్షిణ వలయ స్థాయి పురుష కబడ్డీ పోటీలు నిర్వహిస్తారు. రాయచూరు, యాదగిరి జిల్లాల విద్యార్థులను కబడ్డీ పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో ఏడాది క్రితం క్రీడా కార్యకలాపాలు మొదలయ్యాయని, ఆటగాళ్లు, శిక్షకులు ఆసక్తి తీసుకుంటే జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించడం కష్టమేమి కాదన్నారు. విశ్వవిద్యాలయం అధికారులు అన్ని విధాలా సహకారం అందిస్తారని ఆమె హామీ ఇచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య పార్వతి

నియంత్రికలు మంజూరు చేయాలని వినతి

రాయచూరు, న్యూస్‌టుడే : మాన్వి తాలూకాలోని గోర్కల్ గ్రామానికి కొత్త విద్యుత్తు నియంత్రికలు (ట్రాన్స్‌ఫార్మర్లు) మంజూరు చేయాలని 'తాలూకా రైతు సంఘం' విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం తాలూకా అధ్యక్షుడు సిద్ధయ్య స్వామి నాయకత్వంలో రైతులు జెస్కాం అధికారికి వినతి పత్రం అందజేశారు. సమస్యలను వివరించారు. 46 రోజుల్లో నాలుగు నియంత్రికలు కాలిపోయాయని వివరించారు. ప్రతి సారి పాతవాటికి మరమ్మతులు చేస్తున్నందునే కాలిపోవటానికి కారణంగా పేర్కొన్నారు. కాలిన వెంటనే ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో విద్యుత్తు లేక రాత్రి వేళ దోమలు కుడుతున్నాయని, విద్యార్థులు చదువుకోలేకపోతున్నట్లు వాపోయారు. 63 కేవీ లేక 100 కేవీ సామర్థ్యం కలిగిన నియంత్రికలు ఏర్పాటు చేయాలని కోరారు. మంజూరులో జాప్యం చేస్తే జెస్కాం వద్ద ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.


అధికారికి వినతి పత్రం ఇస్తున్న సంఘం ప్రతినిధులు

వర్గీకరణపై న్యాయవాదుల ఆందోళన

రాయచూరు, న్యూస్‌టుడే : సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు మేరకు దళిత వర్గీకరణ చేయాలని 'దళిత కులాల న్యాయవాదుల సంఘం' ప్రతినిధులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రతినిధులు కరుణాకర కట్టిమని, దొడప్ప, సుదర్శనరెడ్డి నాయకత్వంలో న్యాయవాదులు కోర్టు నుంచి జిల్లా పాలనాధికారి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. జిల్లా పాలనాధికారి నితీష్‌కు వినతి పత్రం అందజేశారు. వర్గీకరణ విషయంలో పంజాబ్, హరియాణా రాష్ట్రాల మాదిరి నిర్ణయం తీసుకోవాలన్నారు. అంతర్గత రిజర్వేషన్లు అమల్లోకి వచ్చే వరకు 35 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 2002లో పదివేల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేసినపుడు మాదిగ, అలెమారి వర్గాలకు అన్యాయం జరిగిందని వివరించారు. తిరిగి పునరావృతం కాకుండా ఉండేందుకు ఉద్యోగాలకు సంబంధించిన అన్ని నోటిఫికేషన్లను రద్దు చేయాలని కోరారు.


జిల్లా పాలనాధికారికి వివరిస్తున్న న్యాయవాదులు

కొండలా.. 'చెత్త' అక్రమాలు

- దారితప్పిన రూ.2067 కోట్లు
- ఐఏఎస్‌లపై ఈడీకి ఫిర్యాదు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : బెంగళూరు మహానగర పాలికెలో చెత్త నిర్వహణ పేరిట అధికారులు, నాయకులు రూ. 2067 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని భాజపా నాయకుడు ఎన్‌ఆర్ రమేశ్ ఆరోపించారు. అక్రమాలకు సంబంధించి 1,295 పుటల దాఖలాలను ఈడీ అధికారులకు ఆయన బుధవారం అందజేశారు. చెత్త నిర్వహణ, సంస్కరణలకు విడుదల అవుతున్న నిధుల్లో ప్రతిసారీ 90 శాతం పక్కదారి పడుతున్నట్లు ఆరోపించారు. పాలికె ముఖ్య కమినర్ తుషార్ గిరినాథ్, మాజీ కమిషనర్లు లక్ష్మీనారాయణ, జి.కుమార్ నాయక్, మంజునాథ్ ప్రసాద్, బీహెచ్ అనిల్ కుమార్, గౌరవ్ గుప్తలను విచారించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులను కోరానని చెప్పారు. నిధులు పక్కదారి మళ్లడంతోనే నగరంలో చెత్త నిర్వహణ పూర్తి స్థాయిలో చేపట్టలేక పోతున్నారని వివరించారు.


ఫిర్యాదు ప్రతిని చూపిస్తున్న ఎన్‌ఆర్ రమేశ్

ఒపెక్‌లో జిల్లా పాలనాధికారి ఆకస్మిక పర్యటన


వైద్యులతో చర్చిస్తున్న పాలనాధికారి నితీశ్

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా పాలనాధికారి నితీశ్ బుధవారం ఒపెక్ (రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ) ఆసుపత్రిలో ఆకస్మికంగా పర్యటించారు. ముందస్తు సమాచారం ఇవ్వక హఠాత్తుగా రావడంతో వైద్యులు, సిబ్బంది కాసేపు కంగారు పడ్డారు. నితీశ్ వార్డులకు వెళ్లి పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఔషధాల గోదామును తనిఖీ చేశారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. అన్ని రకాల మాత్రలు, సిరప్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రి వ్యవహారాలపై వైద్యులతో చర్చించారు. రోగులకు మెరుగైన సేవలందించాలని నిర్దేశించారు. ఆయన వెంట డీహెచ్ఓ డాక్టర్ సురేంద్రబాబు, రిమ్స్ పరిపాలనాధికారి డాక్టర్ దుర్గేశ్ ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను మార్చాలి

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నిటిని ఒకే చోట ఏర్పాటు చేయాలని కర్ణాటక రక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం వేదిక కార్యకర్తలు తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి ఖాలిద్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. తాలూకా పంచాయతీకి నూతన భవనం సమకూరినందున పాత పంచాయతీ భవనంలోకి మహిళా శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ, సర్వేశాఖ, ఎస్సీ, ఎస్టీ శాఖల కార్యాలయాలను మార్చాలని కోరారు. ఈ భవనాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు దూరంగా ఉన్నాయని తెలిపారు. పాత పంచాయతీ భవనాన్ని వృథాగా వదిలివేయకుండా ప్రజలకు ఉపయోగ పడేవిధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.


అధికారికి పత్రం అందిస్తున్న రక్షణ వేదిక కార్యకర్తలు

చాగభావిలో రూ.75 లక్షల అవినీతి

మాన్వి, న్యూస్‌టుడే : సిరివార తాలూకాలోని చాగభావి గ్రామపంచాయతీలో అభివృద్ధి అధికారి, అధ్యక్షుడు, అధికారులు కలిసి రూ. 75 లక్షల మేరకి అవినీతికి పాల్పడ్డారని పంచాయతీ ఉపాధ్యక్షుడు, 12 మంది సభ్యులు ఆరోపించారు. బుధవారం వీరు తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారిని కలిసి ఈ మేరకి పిర్యాదు చేశారు. 15వ ఆర్థిక యోజన, విద్యుత్ పరికరాలు కొన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సభ్యుల అనుమతి లేకుండా పనులు చేసినట్లు చూపి నిధులు స్వాహా చేశారని విమర్శించారు. వీటికి సంబంధించిన పత్రాలు, రికార్డులను ఈఓకు అందించారు. ఉపాధ్యక్షుడు షణ్ముఖప్ప, సభ్యులు బసవనగౌడ, శుభాష్, గురునాథ్‌రెడ్డి, మల్లయ్యస్వామి, బసవనగౌడ లక్కందిన్ని, బసవరాజ్, ఆంజినేయ, తిరుపతి, శివు, అరుణ్, ముస్తాఫా, శివరాజ్‌నాయక్, బాషా తదితరులు పాల్గొన్నారు.

దారులు.. గాడినపడేదెన్నడు?

నేటి చిత్రం

బెంగళూరు నగరంలో వరుసగా కురుస్తున్న వర్షాలు.. రహదారులను ధ్వంసం చేస్తున్నాయి. ఈ రెండు నెలల్లో రూ. 688 కోట్లు ఖర్చు చేసి వివిధ రహదారులను మరమ్మతు చేస్తే.. నేడు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. తారుతో మాసికలు (ప్యాచ్) వేసిన 85 శాతం ప్రాంతాల్లో మళ్లీ గుంతలు పడ్డాయి. ఈ నిధులను గుంతలు పూడ్చేందుకు కాకుండా మహారాష్ట్రలో ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ కోసమే విడుదల చేసినట్లు ఉందంటూ విపక్షాల కార్యకర్తలు పోస్టర్లను విడుదల చేసి, కొన్ని గుంతల వద్ద ప్రదర్శించారు. వర్షం కురుస్తున్న సమయంలోనూ నీటిలో మునిగి ఉన్న గుంతల్లో పడి పలువురు వాహనదారులు గాయాలపాలయ్యారు. వారి గోడు వర్ణనాతీతం. ఏలికలూ.. ఈదారులను దారికి తెచ్చేదెన్నడు?

-న్యూస్‌టుడే, బెంగళూరు గ్రామీణం


మా బ్రాండ్ బెంగళూరు నిధులు.. మహారాష్ట్ర ఎన్నికలకు మళ్లింపు.. అంటూ వ్యంగ్యాస్త్రాలు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

23-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.92	1610.95
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	1,09,314	420
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	1,09,074	9,794
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.461	39.472

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

అరకెరాలో అడ్డపల్లకి మహోత్సవం

మాన్వి, న్యూస్‌టుడే : అరకెరా గ్రామంలో డిసెంబరు 4న ధార్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సూగూరేశ్వరుడికి భక్తులు సమకూర్చిన నూతన రథం ప్రారంభోత్సవం, శ్రీశైల జగద్గురు అడ్డపల్లకి మహోత్సవం ఉంటుంది. సిరుగుప్ప పట్టణానికి వచ్చిన శ్రీశైలం జగద్గురు చన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య స్వామీజీని కలిసి ఆయనను నిర్వాహకులు ఆహ్వాన పత్రికను అందించారు. పంచాక్షరి శివాచార్య స్వామీజీ, అభినవ రేణుకా శాంతమల్ల స్వామీజీ, మృత్యుంజయస్వామి, నాగయ్యస్వామి, చంద్రకాంత్‌శెట్టి, నాగప్పసాహుకార్, సూగూరేశ్వర, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రిక చూస్తున్న శివాచార్య స్వామీజీ

అంబాదేవి ఆలయ సమితి సభ్యుడి ఎన్నిక


కరుటూరి శేషగిరిరావు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా ప్రసిద్ధ పురాతన దేవస్థానం అంబామఠంలోని శ్రీక్షేత్ర సిద్ధపర్వత అంబాదేవి ఆలయానికి నూతన పాలక మండలి ఏర్పాటైంది. దేవాదాయ శాఖ పరిధిలోని ఈ నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ధార్మిక పరిషత్ బుధవారం ప్రకటించింది. ఇందులో లక్ష్మీక్యాంపు వాసి, తెలుగు ప్రముఖుడు కరుటూరి శేషగిరిరావుకు స్థానం దక్కింది. పరిషత్ ప్రకటించిన ఎనిమిది మంది జాబితాలో కరుటూరి శేషగిరిరావు, బంగారిక్యాంపు సదానంద శర్మ, గొరేబాళ్ ఎం. రంగనగౌడ, సోమలాపూరు గ్రామపు శేఖరమ్మ, పార్వతి, శివప్ప గొబ్బరకల్లు, శివశంకరగౌడ సింగాపూరు, రాఘవేంద్ర రెడ్డి ముక్కుంద తదితర ప్రముఖులు ఉన్నారు. నూతన సమితిలో సభ్యునిగా నియమితులైన శేషగిరిరావుకు వివిధ క్యాంపుల ప్రజలు అభినందనలు తెలిపారు.